Follow: @ANNTELUGU

31-07-2026

# మహా పత్రిక

ANN తెలుగు

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 208 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూశారు. గురువారం అర్ధరాత్రి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. గత ఆదివారం హనుమకొండలో ఛాతీనొప్పితో అస్వస్థతకు గురైన ఆయనకు వైద్యులు సీపీఆర్ నిర్వహించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం వెంటిలేటర్‌పై యశోద ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక ఆయన కన్నుమూశారు.తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజాప్రతినిధిగా సేవలందించారు. ఆయన మరణంతో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, స్థానిక ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

టాప్ న్యూస్

### బీజేపీలోకి రాకుంటే చంపేస్తాం అంటున్నారు



- సీజేపీ చీఫ్ హాట్ కామెంట్స్
- విదేశీ నిధుల ఆరోపణలు నిజమైతే కేంద్ర భద్రతా వ్యవస్థ వైఫల్యమేనని వ్యాఖ్యలు

03

### జగన్ ములాఖత్ కు టైం షాక్



- రోడ్డుమార్గంలో వెళ్ళేసరికి ముగిసిన టైం

02

### మోదీ రాజీనామా లేఖ వైరల్



- ఫేక్ లేఖపై పిఐబి క్లారిటీ
- అధికారిక ధృవీకరణ లేకుండా నమ్మొద్దని సూచన

03



# 2034 వరకూ నేనే ముఖ్యమంత్రిగా ఉంటా

## సీఎం రేవంత్‌రెడ్డి



- విద్యాశాఖకు నేనెందుకు రాజీనామా చేయాలి?
- విద్యకోసం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధం
- ఏడాదికి 10 నుంచి 15 మంది టీచర్లను విదేశాలకు పంపిస్తా

**హైదరాబాద్, మహా :** విద్యావ్యవస్థ రాష్ట్రంలో బలపడింద ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యావ్యవస్థ ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొ న్నారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఎంసీహెచ్ఆర్డీ లో ఫిన్‌లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నా రు. 'టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్

మిగతా 2వ పేజీలో

# రియల్ మాఫియా అరాచకం..!

## ప్రభుత్వ భూమిని తెగనమ్మిన కేటుగాళ్లు..!



- 22-(ఎ) నిషేదిత జాబితాలో ఉన్న సర్కారు భూమి గల్లంతు..!
- సర్వే నంబర్లు 90, 91 లలో ప్రభుత్వ భూమి మాయం..!
- భూమి విలువ రూ.200 కోట్లకు పైమాటే ..!
- అదే బాటలో ప్రధాన రహదారిని మింగిన హోటల్ తులిప్స్...!
- హైడ్రాకు ఫిర్యాదు చేసిన స్థానికులు..!
- అన్నీ సవ్యంగానే ఉన్నాయంటూ దాటవేసిన హైడ్రా...!
- ప్రభుత్వ భూమికి ఎన్ఓసి జారీ చేసిన రెవెన్యూ అధికారి ఎవరు...!
- 22 (ఎ) కలెక్టర్ ఇచ్చిన నిషేదిత జాబితా తప్పా...!

02

ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడలో రియల్ మాఫియా అరాచకం పెట్రేగిపోతోంది. ఒక కుటుంబం కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రియల్ మాఫియాతో కుమ్మక్కైన కొందరు కేటుగాళ్లు ప్రభుత్వ భూములను అక్రమంగా విక్రయించిన వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 22-(ఎ) నిషేధిత జాబితాలో నమోదైన సుమారు 6 ఎకరాల ప్రభుత్వ భూమి, ప్రస్తుతం రూ.200 కోట్లకు పైగా విలువ చేసే ఈ స్థలాన్ని కొందరు రియల్టర్లు ఎలాంటి లింక్ డాక్యుమెంట్లు లేకుండానే, లింకుల కోసం అక్రమంగా రకరకాల పేర్లతో డాక్యుమెంట్లు తయారు చేసి క్రయవిక్రయాలు జరిపి ప్రభుత్వ భూమిని కొల్లగొట్టారనే బహిరంగ చర్చ జరుగుతోంది.ఈ వ్యవహారంపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అన్నీ సవ్యంగానే ఉన్నట్లు నివేదిక ఇవ్వడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమి అసలు స్వరూపం ఏమిటి..? 22-(ఎ) జాబితాలో ఉన్న భూములపై లావాదేవీలు ఎలా జరిగాయి..? ప్రస్తుతం ఆ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి..? కలెక్టర్ జారీ చేసిన నిషేదిత జాబితా తప్పా...? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారాయి.



### ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్

**మరో రూ.2,000 కోట్లు విడుదల**

**హైదరాబాద్, మహా :** ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు.

### పోటెత్తుతున్న కృష్ణమ్మ

- శ్రీశైలం డ్యామ్ కు వరద ప్రవాహం
- జూరాల గేట్లు ఎత్తి వేసిన అధికారులు
- ఎల్‌నినో కష్టాల వేళ బిగ్ రిలీఫ్

02



### బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్

- టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు
- ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం
- ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు

02





### ప్రజా సమస్యలపై మంత్రి పొంగులేటి 'దర్బార్'

- కల్లూరులో కల్లూరు, తల్లాడ మండలాల రైతు సదస్సు.. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

02

### వందేమాతరం' దేవతల ఆరాధనను ప్రతిబింబిస్తుంది : ఓవైసీ

- పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన వందేమాతరం

**ఢిల్లీ, మహా :** పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వందేమాతరం బిల్లు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త చట్టంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు వాయిదా పడిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఈ చట్టం దేశ రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'జనగణ మన', 'వందేమాతరం'ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మన జాతీయ గీతమైన 'జనగణమన' పాడినప్పుడు భారతదేశ వైవిధ్యం, ఇక్కడి ప్రజల ఐక్యత కళ్లముందు కదలాడుతాయని... అయితే 'వందేమాతరం' మాత్రం ఒక నిర్దిష్ట పూజా విధానాన్ని, దేవతల ఆరాధనను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు.





మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
జనరల్ వార్తలు | GENERAL NEWS
శుక్రవారం, హైదరాబాద్ | 31-07-2026
ANN తెలుగు

# రియల్ మాఫియా అరాచకం..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** మేడ్చల్-మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్, అన్నోజిగూడలో ప్రభుత్వ భూముల వ్యవహారం సంచలనంగా మారింది. అందుబాటులో ఉన్న ఎన్‌కంబరెన్స్ (ఈసీ) వివరాల ప్రకారం, 2006 సంవత్సరంలో నమోదైన డాక్యుమెంట్ నంబర్ 0102 ద్వారా సేల్ అగ్రిమెంట్ విత్ పోసెషన్ జరిగినట్లు నమోదైంది.
ఈసీలో నమోదైన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 90 లోని 5.11 ఎకరాలు, సర్వే నంబర్ 91 లో 16 గుంటల విస్తీర్ణం ఈ లావాదేవీలో భాగమైనట్లు నమోదై ఉంది. 2006 సంవత్సరంలో బాలగోని ఆంజనేయులు గౌడ్, బాలగోని అరుణ, బాలగోని మధు గౌడ్, బాలగోని వినోద్ గౌడ్, వేముల స్వప్న, బాలగోని దశరథ్ గౌడ్, బాలగోని బాలమ్మ, బాలగోని విజయ్ కుమార్ గౌడ్, బూతుకూరి సోహరాణి, కట్ట అరుణ, సనం అనూష, ధూడాల శ్రీలత, బాలగోని రమేష్ గౌడ్, బాలగోని శైలజ, బాలగోని కార్తీక్ గౌడ్, బాలగోని అక్షయ గౌడ్, బాలగోని ప్రియాంక, బాలగోని శంకరయ్య, బాలగోని శకుంతల, బాలగోని ప్రవీణ్ కుమార్, బాలగోని నవీన్ గౌడ్, బాలగోని సుమన్ గౌడ్, బాలగోని కార్తీక్ గౌడ్, బాలగోని దీప, బాలగోని వెంకటమ్మ, బాలగోని పెద్ద నర్సింహ గౌడ్, బాలగోని సుగుణమ్మ, బాలగోని సుధాకర్ గౌడ్, అనంతి సుధారాణి, వలస రేవతి, మారగోని ఉమారాణి అందరు కలిసి ఎం/ఎస్ నవభారత్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ లిమిటెడ్ (ప్రతినిధి కృష్ణారెడ్డి) కి విక్రయించారు. అయితే ప్రస్తుతం ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో 22(ఎ) నిషేధిత జాబితాలో ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ భూమిగా నమోదై ఉండగా, మరోవైపు వాటికి సంబంధించిన ఒప్పందాలు, యాజమాన్య హక్కుల బదిలీలు, తదనంతర లావాదేవీలు ఎలా జరిగాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ప్రభుత్వ భూములుగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతుండగా సర్వే నంబర్లకు సంబంధించి ఇంత పెద్ద ఎత్తున లావాదేవీలు జరగడం, వాటిలో పలువురు వ్యక్తులు మరియు ఒక ప్రైవేట్ కంపెనీ పేరు కనిపించడం వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ రికార్డులు, 22(ఎ) నిషేధిత జాబితా, ఎన్‌కంబరెన్స్ రికార్డులు, ప్రస్తుతం ఉన్న యాజమాన్య హక్కులపై సమగ్ర విచారణ జరిపితేనే అసలు నిజాలు బయటపడతాయని వారు పేర్కొంటున్నారు.

**లింక్ డాక్యుమెంట్లు లేకుండానే లావాదేవీలు..!**
ప్రభుత్వ భూమికి సంబంధించి అసలు యాజమాన్య హక్కులు, చట్టబద్ధమైన లింక్ డాక్యుమెంట్లు లేకపోయినా, కొందరు మధ్యవర్తులు, రియల్టర్లు కుమ్మక్కై క్రయవిక్రయాలు జరిపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు చేతులు మారుతున్న సమయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు ఎలా అనుమతించాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**ప్రధాన రహదారిని మింగిన హోటల్ తులిప్స్..!**



| Sl. No. | Name of the District | Name of the Mandal | Name of the Village | Sy.No. & Sub Division No. (if any) | Town Sy.No. (if applicable) | House No. (if applicable) | Extent | State Government/ Central Government |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 33 | Medchal-Malkajgiri | Ghatkesar | Annojiguda | 90 | -- | -- | 5-12 | State Govt. |
| 34 | Medchal-Malkajgiri | Ghatkesar | Annojiguda | 90/Part | - | - | 0-1 | Gairan Sarkari Bypass road |
| 35 | Medchal-Malkajgiri | Ghatkesar | Annojiguda | 91 | -- | -- | 0-16 | State Govt. |
| 36 | Medchal-Malkajgiri | Ghatkesar | Annojiguda | 97/Part | - | - | 0-03 | By pass Road |
| 37 | Medchal-Malkajgiri | Ghatkesar | Annojiguda | 98/Part | - | - | 0-30 | By pass Road |

Tahsildar, Ghatkesar Mandal — Revenue Divisional Officer, Keesara Division — Additional Collector Medchal-Malkajgiri District — Collector & District Magistrate, Medchal-Malkajgiri District.

**నిషేధిత జాబితల్లో ఉన్నట్లు కలెక్టర్ జారీ చేసిన నివేదిక**

అదే ప్రాంతంలో ప్రధాన రహదారిని ఆక్రమించి హోటల్ తులిప్స్ నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా వినియోగానికి కేటాయించిన రహదారిని క్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా సంబంధిత శాఖలు ఎందుకు స్పందించలేదనే ప్రశ్నలు స్థానికులు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ భూముల మాదిరిగానే ప్రజా రహదారులు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హైడ్రాకు ఫిర్యాదు... అయినా ఫలితం శూన్యం..!**
ఈ వ్యవహారంపై స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అన్నీ సవ్యంగానే ఉన్నట్లు నివేదిక ఇవ్వడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. ప్రభుత్వ భూములు, రహదారి ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎలాంటి లోపాలు లేవని తేల్చడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ భూమిని ఆక్రమించి తులిప్ హోటల్ నిర్మాణం

## సమగ్ర విచారణకు డిమాండ్..!

వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న క్రమంలో రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 22(ఎ) నిషేధిత జాబితాలో ఉన్న భూములపై లావాదేవీలు ఎలా జరిగాయి..? ఎలాంటి ఆధారాలతో రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలు నమోదయ్యాయి..? ఇందులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల పాత్ర ఏమిటి..? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా అప్పటి రెవెన్యూ అధికారులు, సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పాత్రపై లోతైన దర్యాప్తు జరపాలని, ప్రభుత్వ భూములకు సంబంధించిన లావాదేవీలను అనుమతించిన వారిపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లయితే, అందుకు బాధ్యులైన అధికారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే సుమారు 6 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ స్వాధీనం చేసుకుని, ఆక్రమణలు, అక్రమ క్రయవిక్రయాలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాజేసేందుకు కుట్ర పన్నిన వ్యక్తులు, వారికి సహకరించిన అధికారులు ఎవరైనా ఉన్నట్లయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేకుండా వ్యవహరించి, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

**ప్రభుత్వ భూమికి ఎన్‌ఓసీ జారీ చేసినది ఎవరు..?**
22(ఎ) నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ఎన్‌ఓసీలు ఎలా జారీ అయ్యాయనే అంశం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అసలు ప్రభుత్వ భూమికి ఎన్‌ఓసీ ఇచ్చిన రెవెన్యూ అధికారి ఎవరు..? ఏ ఆధారాలతో ఆ అనుమతులు మంజూరు చేశారు..? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. కలెక్టర్ జాబితా తప్పా..? లేక లావాదేవీలే అక్రమమా..? మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం 22(ఎ) కింద నిషేధిత జాబితాలో చేర్చిన భూములపై క్రయవిక్రయాలు ఎలా జరిగాయన్నది కీలక ప్రశ్నగా మారింది. ఒకవేళ భూములు ప్రభుత్వానికి చెందినవి కాకపోతే నిషేధిత జాబితాలో ఎందుకు చేర్చారు..? ఒకవేళ కలెక్టర్ జారీ చేసిన జాబితా సరైనదైతే ఆ భూములపై రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి..? ప్రస్తుతం ఆ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి..? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

---

## బీజేపీలోకి రాకుంటే చంపేస్తామంటున్నారు
### ..సీజేపీ చీఫ్ హాట్ కామెంట్స్

**ఢిల్లీ, మహా :** బీజేపీలోకి రావాలని తనను బెదిరిస్తున్నారని కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజీత్ బీప్కే సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీలో చేరితే నేను, నా కుటుంబం బాగుంటుందని ప్రలోభపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మహారాష్ట్ర ఛత్రపతి శంభాజీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీలో చేరకపోతే కుటుంబాన్ని చంపేస్తామని ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని దేశంలో అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు ఈ విధంగా బెదిరించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మోడీ, అమిత్ షా తో పోలిస్తే నా వయసు ఎంత? యువతను భయపెట్టే స్థాయికి దిగజారుతున్నారంటే అలాంటి పదవులకు విలువ ఏముందని ప్రశ్నించారు. విద్యార్థుల నిరసనల సమయంలో జరిగిన పోలీసుల దాడికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అభిజీత్ డిమాండ్ చేశారు. అమిత్ షా చెప్పడం వల్లే పోలీసులు ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ వాడి ఉండవచ్చని అన్నారు. పెల్లెట్ గన్స్ వాడటం తాను కళ్లారా చూశానని, బిహార్ లో ఏకంగా ఏకే 47 ను ఉపోగించారని అన్నారు. కసబ్ లాంటి ఉగ్రవాదులపై వాడాల్సిన ఏకే 47 లను యువతపై ఎక్కుపెడతారా అని ప్రశ్నించారు. పోలీసుల దాడుల్లో కొందరు విద్యార్థులు కంటిచూపు కోల్పోయారని ఆరోపించారు. విదేశీ నిధులు వస్తున్నాయని చేసే ఆరోపణలు నిజమైతే అది దేశభద్రతా యంత్రాంగం వైఫల్యమేనని, దానికి హోంమంత్రినే జవాబుదారీని చేయాలని అన్నారు. నూతన విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ మునుపటి మంత్రికి రిప్లేస్‌మెంట్ కాపీ మాత్రమేనని ఎద్దేవా చేశారు.

---

## మంత్రి సీతక్క సెక్రటేరియట్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ యాక్టివిటీస్ రివ్యూ

**మహా :** అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తుందని అందులో భాగంగా అంగన్వాడీ టీచరమ్మల సలహాలు సూచనలు తీసుకోవడానికి జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలని అధికారులను అదేశించిన మంత్రి సీతక్క ఎక్కడ ఎక్కడ టాయిలెట్స్, కరెంటు, త్రాగునీటి సమస్యలు గుర్తించి పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చిన మంత్రి సీతక్క త్వరలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఇచ్చే యూనిఫార్మ్ ను పరిశీలించిన మంత్రి సీతక్క
అక్టోబర్ ఒకటవ వారంలోగా సిద్ధం చేయాలని ఆదేశించింన మంత్రి సీతక్కప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్స్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని ఆదేశించింన మంత్రి, ఇప్పటికీ 17 ఉన్నట్లు తెలియజేసిన అధికారులు అంగన్వాడీ టీచర్స్, ఆయాల రిక్రూట్మెంట్ సమీక్షించిన మంత్రి సీతక్క 16 జిల్లాలో నోటిఫికేషన్స్ ఇచ్చినట్లుగా తెలిపిన అధికారులు. మిగితా జిల్లాలో కలెక్టర్స్ మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించింది మంత్రి సీతక్క అంగన్వాడీ సెంటర్లలో పిల్లల పోషకాహారం, ఎదుగుదల మీద ఒక శాంపిల్ సర్వే నిర్వహించి, ఏ విధంగా మెరుగుపడాలి చూడాలి అని ఆదేశించింన మంత్రి సీతక్క. కేంద్రం నుండి వచ్చే ఫండ్స్ లాప్స్ అవకుండా ప్రజల అవసరాల కోసం పూర్తి స్థాయిలో వినియోగించాలని ఆదేశించింది.

---

# 2034 వరకూ నేనే ముఖ్యమంత్రిగా ఉంటా

(మొదటి పేజీ తరువాయి)
విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌చేంజ్' కార్యక్రమంలో భాగంగా ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఉపాధ్యాయుల బృందం పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారు..**
జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు వేసిన పునాదులతో ఇప్పుడు మన దేశంలో లైఫ్‌స్పాన్ పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇక్కడి పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని చెప్పారు. విద్యలో నాణ్యత పెరగాలని, పిల్లలకు పౌష్టికాహారం అందాలని సూచించారు. తెలంగాణలో తనకు తెలిసిన మేధావులు ఇద్దరేనని.. వారిలో కేకే, జైపాల్‌రెడ్డి అని అభివర్ణించారు. విద్య విషయంలో బాధ్యత తీసుకోవాలని కేకేను అడిగానని చెప్పుకొచ్చారు. ఆయన సలహాదారుగా అనేక సూచనలు చేస్తున్నారని తెలిపారు. వెనకబాటుతనానికి కారణం చదువులేకపోవడమేనని చెప్పుకొచ్చారు. చదువుకున్న ఎస్సీలు సమాజంలో మంచి స్థానంలో ఉన్నారని వివరించారు. ఆస్తులున్నా.. చదువు లేకపోతే సమాజంలో వెనకపడిపోతున్నారని వెల్లడించారు. విద్యార్థులను సమాజంలో గొప్పగా నిలబెట్టగలిగిన శక్తి ఉపాధ్యాయులకు ఉందని కొనియాడారు. ప్రతీ విద్యార్థిపై రూ.1,08,000 ఖర్చు తాము చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

**ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదు..**
పీవీ నర్సింహారావు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వేల్‌లో ఆ స్కూల్లోనే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు చదువుకున్నారని ప్రస్తావించారు. నవోదయకు స్ఫూర్తి సర్వేల్ గురుకులమని చెప్పుకొచ్చారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదని అభిప్రాయపడ్డారు. ప్రపంచం ఇంకా మెరుగైన నాణ్యమైన విద్య ఆశిస్తుందని తెలిపారు. నేర్చుకోవడమే కాదని.. నేర్చుకున్న వాళ్లతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని అన్నారు. జర్మన్, జపాన్, సౌత్ కొరియా, చైనా లాంటి దేశాలతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని సూచించారు. బదిలీలు, ప్రమోషన్లు అన్నీ అడగకుండానే తాము ఇచ్చామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సమస్యలు తనకు వదిలేయాలని అన్నారు. వారి సమస్యలను తాను పరిష్కరిస్తానని మాటిచ్చారు. 2023 వరకు ఒకటో తేదీనే జీతాలు పడ్డాయా? అని ప్రశ్నించారు. ఈ మూడేళ్లు తెలంగాణను సక్రమంగానే నడిపించానని స్పష్టం చేశారు. ఎక్కడా ఆగం కాలేదని.. కలగాపులగం చేయలేదని తెలిపారు. ప్రతి విద్యార్థిపై రూ.1,08,000 ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. 201423 మధ్య డ్రాపౌట్స్ పెరిగాయని వివరించారు. 202326 వరకు డ్రాపౌట్స్ తగ్గి అడ్మిషన్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. విద్యాశాఖలో తాము తెచ్చిన సంస్కరణలే ఇందుకు కారణమని వెల్లడించారు. క్రమశిక్షణ లేకపోతే ఎంత తెలివి ఉన్నా పనికిరారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్ కోసమే విద్యాశాఖ తీసుకున్నా**
అధికారం, ఓట్లు ఎక్కువగా ఇచ్చే శాఖలపైనే సాధారణంగా అందరికీ మక్కువ ఉంటుందని ఓట్లు రావని తెలిసినా విద్యార్థుల భవిష్యత్తు, సమాజంలో మార్పు కోసమే తాను విద్యా శాఖ తీసుకున్నానని సీఎం పేర్కొన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలన్నదే లక్ష్యమన్నారు. అయితే కొందరు విద్యాశాఖకు మంత్రి లేదని త్వరగా ఆ శాఖకు ఓ మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారన్న సీఎం, అయితే ఏ కారణంతో తాను విద్యాశాఖకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. గవర్నమెంట్ స్కూల్స్ లో చేరుతున్న వారి సంఖ్య పెంచినందుకా? లేక విద్యార్థులకు అల్పాహార పథకం తీసుకువచ్చినందుకు రాజీనామా చేయాలా అని మండిపడ్డారు. మండల స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు మండలం ఒక యూనిట్ గా డిసెంబర్ నాటికి ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈఓలు నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం ఓ వెబ్ సైట్ ను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఏటా పది నుంచి 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని విదేశాలకు పంపి అక్కడి విధానాలను అధ్యయనం చేయిస్తామని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు, కార్యదర్శి యోగితారాణా పాల్గొన్నా

---

# ప్రజా సమస్యలపై మంత్రి పొంగులేటి 'దర్బార్'

### కల్లూరులో కల్లూరు, తల్లాడ మండలాల రైతు సదస్సు.. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

సత్తుపల్లి, జూలై 30: మహా.: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కల్లూరులోని డీఎన్‌పీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం కల్లూరు, తల్లాడ మండలాలకు సంబంధించిన రైతు సదస్సు జరిగింది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌తో పాటు అదనపు కలెక్టర్, డీఎఫ్ఓ, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. కల్లూరు, తల్లాడ మండలాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు నేరుగా అందజేశారు. భూ సమస్యలు, రైతుల సమస్యలు, రెవెన్యూ, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు.

**రైతు సంక్షేమమే ధ్యేయం..**
రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలు తమ సమస్యలను వివరించిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలను సూచించారు. పెండింగ్ సమస్యలను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన అవకతవకలు, ప్రజలకు జరిగిన నష్టాలను మంత్రి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.

**ప్రభుత్వానికి ప్రజల కృతజ్ఞతలు..**
ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ కృతజ్ఞతలు తెలిపారు.

---

## మోదీ రాజీనామా లేఖ వైరల్
### ఫేక్ లేఖపై పిఐబి క్లారిటీ

**ఢిల్లీ, మహా :** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది .

---

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

- **సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి**
- **ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి**
- **నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ**

**మహా :** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.

---

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)
ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా




అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి.

---

# పరామర్శ అంటే ఇదేనా?

### మండిపడ్డ మంత్రి పార్థసారథి
### ప్రశాంతతను చెడగొట్టేందుకే జగన్ టూర్

**అమరావతి, మహా :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ లక్ష్యం పరామర్శ కాదని, అక్కడున్న ఆనందకర పరిస్థితులను భగ్నం చేయడమేనని మంత్రి పార్థసారథి అన్నారు. జైలులో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిన తీరుపై ఆయన స్పందించారు. ఆంక్షలు ఉన్నపటికీ వేలాది మంది నేతలు, కార్యకర్తలతో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించారని మండిపడ్డారు. రణస్థలం మండలం పైడిభీమవరంలో మహిళా ఎస్ఐను దూషించడంపై పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎస్సై అని కూడా దౌర్జన్యానికి పాల్పడ్డారని మండిపడ్డారు. టూర్ పేరు చెప్పి అరాచకాలకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగన్ పరామర్శ యాత్ర ఎందుకు చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 1న ప్రధాని మోడీ వస్తున్నారని, ఒక రోజు ముందే కావాలని జగన్ పర్యటన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో భయానక వాతావరణాన్నిసృష్టించేందుకు జగన్ పర్యటన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

---

# పోటెత్తుతున్న కృష్ణమ్మ

### శ్రీశైలం డ్యామ్ కు వరద ప్రవాహం
### జూరాల గేట్లు ఎత్తి వేసిన అధికారులు
### ఎల్‌నినో కష్టాల వేళ బిగ్ రిలీఫ్

**హైదరాబాద్, మహా :** వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన సమయంలో కృష్ణానది జలకళను సంతరించుకుంటోంది. ఎట్టకేలకు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రారంభమైంది. వానా కాలం మొదలై రెండు నెలలైనా ఇప్పటివరకు ఎగువ నుంచి ఇన్ ఫ్లో రాలేదు. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. దీంతో, దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. తెలుగు రాష్ట్రాలను రెండు నెలల కాలంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితు లు ఏర్పడ్డాయి. ఈ సమయంలోనే కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లోకుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమ ల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో.. జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది.

పెరుగుతున్న ఇన్ ఫ్లో.. అధికారుల అప్రమత్తం
అదే సమయంలో ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఫలితంగా రానున్మన రోజుల్లో శ్రీశైలానికి మరింత ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా అటు గోదావరి బేసిన్లలో ప్రాజెక్టులకు వరద ప్రవాహం మొదలవడంతో రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ ప్రాంతాలు, స్థానిక పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. గోదావరి బేసిన్ లోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక, కృష్ణాపై ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి బుధవారం 80 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కాగా, నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 89,520 క్యూసెక్కులను జూరాలకు విడుదల చేస్తున్నారు. ఇక.. శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రస్తుతం 18,349 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 823.70కు చేరింది. రానున్న నాలుగు రోజుల్లో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని.. నీటిని దిగువకు విడుదల చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

---

# జగన్ ములాఖత్ కు టైం షాక్

### రోడ్డుమార్గంలో వెళ్ళేసరికి ముగిసిన టైం

**అమరావతి, మహా :** మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కలిసేందుకు వైఎస్ జగన్ జైలు ములాఖత్ తీసుకోగా, విశాఖ నుంచి రోడ్డు మార్గంలో యాత్ర చేయడంతో జైలు ములాఖత్ సమయం ముగిసింది. దీంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. అయితే ఈ ఘటనపై హోంమంత్రి అనిత స్పందించారు. జగన్ పర్యటనలో జరిగిన ఘటనపైనా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పర్యటనలో మహిళా ఎస్సై పట్ల వైసీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారని, ఆమెను చుట్టిముట్టి ఇబ్బందులకు గురి చేశారని అనిత మండిపడ్డారు. వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ములాఖత్ సమయం ముగియడంతో జైలు గేట్లు మూసివేశామని అనిత పేర్కొన్నారు. జగన్ శ్రీకాకుళం పర్యటన వెనుక ప్రత్యేక అజెండా ఉందని ఆరోపించారు. జగన్ పర్యటనపై ఎలాంటి ఆంక్షలులేవని స్పష్టం చేశారు. ఆంక్షలు పెట్టి ఉంటే జగన్ అసలు పర్యటనకు వెళ్లగలిగేవారేనా ప్రశ్నించారు. ట్రాఫిక్ క్లియర్ చేసి పంపేందుకు ప్రయత్నం చేశామని, కానీ జగన్ కావాలనే ఆలస్యం చేశారని వంగలపూడి అనిత ఆరోపించారు.

# ఘనంగా తీజ్ పండుగ వేడుకలు

**ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య డాన్స్**



**యాదాద్రి భువనగిరి జూలై 30 మహా**: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం బోయినిపల్లి తండాలో బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సర్పంచ్ భూక్య రజిత రమేష్ నాయక్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తండా మహిళలు, యువతులు సంప్రదాయ బంజారా వస్త్రధారణలో తీజ్ పండుగ ప్రత్యేక నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తండా ప్రజలతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు.

ఆయన తండా వాసులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేయడం అక్కడి ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. స్థానికులు ఆనందోత్సాహాలతో ఆయనకు ఘన స్వాగతం పలికి, ప్రేమాభిమానాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, కుటుంబ సౌభాగ్యం, సుఖశాంతి, మంచి వర్షాలు, సమృద్ధి పంటల కోసం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవడం విశిష్ట సంప్రదాయమని పేర్కొన్నారు..తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించే దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.తండాల అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్, ఉపాధి వంటి అన్ని రంగాల్లో గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. తీజ్ పండుగ సందర్భంగా నాయకుని తండా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత, తండా పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలి.!

- జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు
- తుక్కుగూడలో ఆగస్టు 2న ఏఐటీయూసీ జిల్లా మహాసభలు
- నాలుగవ మహాసభను విజయవంతం చేయండి: ఏఐటియుసి




**మహేశ్వరం జూలై 30 మహా:** కార్మికుల వైద్య సదుపాయాల కోసం జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ నియమించాలి పానుగంటి పర్వతాలు అన్నారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటియుసి) రంగారెడ్డి జిల్లా నాలుగోవ మహాసభ ఆగస్టు 2న, మహేశ్వరం మండలం, తుక్కుగూడలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ఈ మహాసభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి చంద్రయ్యలు హాజరవుతున్నారని పర్వతాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఏఐటీయూసీ విస్తరణకు భవిష్యత్తు ఉద్యమాలకు కార్మికుల సమస్యలు, కార్మికులకు వైద్య సదుపాయాల కోసం జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ నియమించాలి, వలస కార్మికుల సమస్యల పై మహాసభలో చర్చించి నిర్ణయాలు చేస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తు నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కే చందుయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, పి.దేవేందర్ గౌడ్, కొమ్మగళ్ళ రాజు, యాదగిరి, శివ, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- అధికారులతో ఎమ్మెల్యే రేవూరి సమీక్ష
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



**హనుమకొండ, మహా:** పరకాల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.రహదారులు, మిషన్ భగీరథ, ఇందిరమ్మ ఇళ్లు, టెక్స్టైల్ పార్క్, ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కలెక్టర్లు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని పనులను వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్






**బెల్లంపల్లి, మహా:** భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి మున్సిపాలిటీలో పరిస్థితులను పలు వార్డులలో వరద ముప్పు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పరిశీలించారు.రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసౌకర్యాలు ఏర్పడిన వరదలు ఇళ్లలోకి నీరు చేరిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. పలు వార్డులలో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ దావత్ స్వాతి రమేష్ బాబులు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయంగా ఉంటూ వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైనేజీలు, రోడ్లు, నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,. ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి" అని ఎమ్మెల్యే ఆదేశించారు, అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ బెల్లంపల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో వరద ఉద్ధృతి అప్రమత్తమైన పంచాయతీ యంత్రాంగం



**పాలకుర్తి 30 జూలై మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల శుక్రవారం ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి తక్షణ ఉపశమన చర్యలు చేపట్టారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయతీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జెసిబితో సహాయంతో ఎల్లమ్మ ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వరద నీరు ఇళ్లకు చేరకుండా, జెసిబి సహాయంతో వెంటనే గండి కొట్టించి నీటి ప్రవాహాన్ని సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు తొలగింపు పాలకుర్తి నుండి బక్కరాజంపల్లె వెళ్లే మార్గంలో వాగు సమీపంలో ఒక భారీ చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే జెసిబితో చెట్టును తొలగింపజేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.ప్రస్తుతం బక్కరాజంపల్లె వాగులో వరద ఉద్ధృతి తీవ్రంగా ఉన్నందున, గ్రామ ప్రజలు, ప్రయాణికులు ఎవరూ సాహసించి వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సర్పంచ్ పెద్దపల్లి తిరుమల గారు విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదాసు రమేష్, మాజీ ఎంపిటిసి దుర్గం కుమార్, చిప్ప శ్రీధర్, దుర్గం సంతోష్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం తొలి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించారు.గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంతో పాటు, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సేవలు, పారిశుద్ధ్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని, వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మత్స్యశాఖ, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్యుత్ తదితర శాఖలు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, గోదావరి స్నాన ఘాట్లు, పర్యాటక ప్రాంతాలు, నది తీరాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను నదిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.

## పేదరాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**ఔదార్యం చాటిన సర్పంచ్ ప్రవీణ్**

**కారేపల్లి, మహ** : పేదరాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించి అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తులిశ్యాతండాకు చెందిన గుగులోత్ బుజ్జి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ దండు ప్రవీణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అనుచరుడు ఎస్.ఎన్. నాయక్ క్వింటా బియ్యం అందించేందుకు ముందుకు వచ్చారు. మృతురాలిని పరామర్శించిన వారిలో వార్డు సభ్యురాలు జర్పుల శాలి, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

# టాక్సీ స్టాండ్ గా మారిన హనుమకొండ బస్టాండ్ జంక్షన్

- విచ్చలవిడిగా రోడ్డు పైనే ఎర్టిగా కార్ల పార్కింగ్
- తరుచూ ట్రాఫిక్ జామ్ పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు, రోగులు
- సంబంధిత శాఖల పై ముడుపుల ఆరోపణలు
- ఫిర్యాదులు చేసినా ఫలితం లేదంటున్న స్థానికులు, వాహనదారులు



**హనుమకొండ, మహా ;** హనుమకొండ బస్టాండ్ వద్ద ఉన్న జంక్షన్ నుండి హైదరాబాద్ కు వెళ్లే ప్రధాన రహదారి పైనా ప్రైవేట్ టాక్సీల అరాచకం రోజురోజుకు పెరుగుతోంది. హైదరాబాద్ కు వెళ్లే ప్రధాన రహదారిని టాక్సీ డ్రైవర్లు తమ సొంత స్టాండ్‌గా మార్చేశారు. హనుమకొండ బస్టాండ్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు ఇలా అనేక వాహనాలు ఈ జంక్షన్ నుండే వెళ్తుంటాయి. దీంతో నిత్యం అత్యంత రద్దీగా ఉండే జంక్షన్ లలో ఇది ప్రధానమైనది. ముఖ్యంగా హనుమకొండ బస్టాండ్ చుట్టూ ఎన్నో ప్రైవేట్ ఆస్పత్రులు ఉండడంతో దూర ప్రాంతాల నుండి చాలా మంది రోగులు ఇక్కడికి వస్తుంటారు. అంబులెన్స్ వెళ్లాలన్న ప్రైవేట్ వాహనాల ద్వారా ఆసుపత్రులకు చేరుకోవాలన్న రోగులుతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా బస్టాండ్ ఆవరణలో రోడ్డుపైనే ఆటోల అడ్డా, అటువైపు విచ్చలవిడిగా కార్లు నిలపడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ తో స్థానిక వ్యాపారస్తులు, వాహనదారులు రోజు నరకం చూస్తున్నామని వారు వాపోతున్నారు.

**రోడ్డు సగం ఆక్రమించిన ప్రైవేట్ కార్లు**

రాడార్ దయాగ్నొస్టిక్ ఎదురుగా, బస్టాండ్ నుండి హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డు పై మూల మలుపులో 10కి పైగా ఎర్టిగా కార్లు , ఇతర ప్రైవేట్ కార్లు రోడ్డు పైనే వరుసగా నిలిపి వేస్తున్నారు. రోడ్డు సగం ఆక్రమించడంతో వచ్చేపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు బస్టాండ్ వద్ద ఆటోలు, ప్రైవేటు వాహనాలు ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు.

**ఆసుపత్రులకు వెళ్లే రోగులకు ఇబ్బందులు**

ఈ జంక్షన్ కు ఆనుకునే రాడార్ డయాగ్నస్టిక్స్ వంటి ప్రైవేట్ ఆసుపత్రులు చాలా ఉన్నాయి. అత్యవసర రోగులను తీసుకెళ్లే వాహనాలు ఈ టాక్సీల వల్ల ఒక్కోసారి 1520 నిమిషాలు ట్రాఫిక్‌లో నిలబడాల్సి వస్తోంది. "అంబులెన్స్ కూడా ముందుకు వెళ్లడం లేదు. పోలీసులు ఏం చేస్తున్నారు?" అని స్థానిక వ్యాపారస్తులు ప్రశ్నిస్తున్నారు.

**ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న బస్సులు, ఆటోలు**

హనుమకొండ నుండి ఉప్పల్, హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు ప్రతిరోజూ ఈ జంక్షన్‌లో అరగంట వరకు నిలబడాల్సి వస్తోంది. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. రోడ్డు పక్కన చెత్త, మురుగు కూడా చేరడంతో పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

**ఫిర్యాదులు చేసినా చర్యలు లేవు - ఆరోపణలు**

ఈ సమస్య పై పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రతి టాక్సీ నుండి వసూళ్లు జరుగుతున్నాయని అందుకే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే జంక్షన్ వద్దే ట్రాఫిక్ సిబ్బంది ఉన్న వారు పట్టించుకోరు మరి ముఖ్యంగా కొంతమంది ట్రాఫిక్ పోలీసులు బస్టాండ్ కు సమీపంలో తనిఖీలు నిర్వహించి వాహనదారుల పై చలాన్లు వేస్తుంటారు కానీ రోడ్డుపైనే అడ్డగోలుగా పార్కింగ్ చేసిన వాహనాలను చిరు వ్యాపారస్తులను ఇవేమీ పట్టించుకోరు అని వాహనదారులు మండిపడుతున్నారు.

**ప్రజల డిమాండ్**

ఇప్పటికైనా వరంగల్ పోలీస్ కమిషనర్, ట్రాఫిక్, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఈ జంక్షన్ లో ట్రాఫిక్ నియంత్రణ లో భాగంగా అక్రమ పార్కింగ్‌లను తొలగించి, టాక్సీలకు, ఆటో లకు ప్రత్యేక స్టాండ్ కేటాయించాలని, 24 గంటల పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# గ్రామాలను అభివృధి పరిచేందుకు అధికారులు రాజకీయ నాయకులు సమన్వయంతో పని చేయాలి

**మండల సర్వసభ్య సమావేశంలో డీపీఓ సురేష్ మోహన్**




**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సురేష్ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో హిమబిందు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాల సమగ్రాభివృద్ధికి అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. స్థానిక అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులకు ముందస్తు సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభంలో పలు గ్రామాల సర్పంచులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేపడుతున్న పనులు, వివిధ శాఖల కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని, దీనివల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన డీపీఓ సురేష్ మోహన్ అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తూ, ప్రతి సమస్యపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కార్యకలాపాలు నిర్వహించడం సరికాదని ఆయన హెచ్చరించారు. మండలంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతు రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై డీపీఓ విస్తృత సమీక్ష నిర్వహించారు. మండలంలో సుమారు 24 వేల మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 9 వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో వచ్చే కాలంలో నీటి నిల్వలు తగ్గే ప్రమాదం ఉందని, ఈ క్రమంలో రైతులు 'జలసిరి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, పొలాల్లో వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేలా చర్యలు చేపట్టాలని డీపీఓ కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడంపై ఎంపీడీవో హిమబిందు ప్రత్యేకంగా మాట్లాడారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే జరిమానాలు విధిస్తామని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ నిధులను నిబంధనలకు అనుగుణంగా వినియోగించి, మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశం ముగింపులో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని వివరించారు. నిధుల వినియోగం, పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్

**రంగారెడ్డి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయ సేవల కోసం జిల్లా కలెక్టరేట్ లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే 040 23237416, 9704958473 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల సమీపంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు.

# రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం

- భారీ వర్షా లపై సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు
- 24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి



**వరంగల్, మహా:** రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరద పరిస్థితులు, ముందస్తు చర్యలపై సమీక్షించారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, పడవలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రమాదకర వంతెనలు, జలపాతాలు, పర్యాటక ప్రాంతాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని, అన్ని జిల్లాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు నిర్వహించాలని సూచించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్‌పాయ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రజలు వరద నీటిలోకి వెళ్లకుండా అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# నకిలీ బంగారం కేసులో దర్యాప్తు ముమ్మరం

**కారేపల్లి, మహా:** తక్కువ ధరకే బంగారం ఇస్తామని అమాయకులను నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్న నకిలీ బంగారం వ్యవహారంపై కారేపల్లి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో కీలక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.బంగారం పూత పూసిన ఆభరణాలను అసలు బంగారంగా విక్రయించడంతో పాటు వాటిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టించి రుణాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు విచారణ చేపట్టగా, మరికొందరి ప్రమేయంపై కూడా ఆరా తీస్తున్నారు. ఈ విషయమై ఎస్సై భైరు గోపి స్పందిస్తూ నకిలీ బంగారం వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.



ANN తెలుగు
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్
31-07-2026
మహా ప్రత్యేకం
04

# మోదీ చెప్పినా తగ్గేదేలే

**బంగారం కొనుగోళ్లలో భారత్ బాహుబలి**
**మీ ఇల్లు బంగారం కానూ..**





(మహా ప్రత్యేకం)

పైడికాంతులపై భారతీయులకున్న చెక్కుచెదరని ప్రేమానురాగానికిది తిరుగులేని ప్రతిరూపం! ధరల నవమి వేళ పసిడి రేట్లు ఆకాశపు అంచుల తాకినా, భారతీయ మదిలో ఆ స్వర్ణస్వప్నం సడలలేదు. కొనుగోలు బరువు స్వల్పంగా తగ్గినట్లు అనిపించినా, విసిరిన ధనరాశుల వెల్లువలో భారత్ పసిడి మార్కెట్‌లో మరోసారి సాటిలేని 'బాహుబలి'గా అవతరించింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ విడుదల చేసిన 2026 రెండో త్రైమాసికం (ఏప్రిల్ - జూన్) తాజా నివేదిక ప్రకారం—ధరల ప్రవాహం ఎంత ఉద్ధృతంగా సాగినా, పుత్తడి కాంతులను తమ సొంతం చేసుకోవడంలో భారతీయుల పట్టుదల అరించింతై పొడవునా మెరుస్తూనే ఉందని స్పష్టమైంది. భవిష్యత్తుకు భరోసానిచ్చే లక్ష్మీ స్వరూపంగా, సింగారానికి ప్రతిరూపంగా పసిడికి ఉన్న ఆదరణ మునుపటికంటే మరింత శోభాయమానంగా వెలిగిపోతోంది. భారతీయులకు పసిడిపై ఉన్న మమకారం ఎటువంటిదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ధరలు ఆకాశాన్నంటి రికార్డు స్థాయికి చేరినా సరే, మేలిమి డిజైన్లను సొంతం చేసుకోవడంలో గానీ, భవిష్యత్ పెట్టుబడిగా బంగారాన్ని కొనుగోలు చేయడంలో గానీ భారతీయులు ఎప్పుడూ వెనుకంజ వేయరు. తాజాగా వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ విడుదల చేసిన 2026 రెండో త్రైమాసికం (ఏప్రిల్ - జూన్) నివేదిక ఈ విషయాన్ని మరోసారి ఘనంగా చాటిచెప్పింది. గతేడాదితో పోలిస్తే భారతీయులు కొనుగోలు చేసిన బంగారం బరువు తగ్గినా, దానికి వెచ్చించిన సొమ్ము మాత్రం ఏకంగా 50 శాతం పెరగడం విశేషం.

### మూడునెలల్లో.. రూ. 1,98,100 కోట్ల బంగారం కొనుగోళ్ళు

పరిమాణం తగ్గినా.. భారం పెరిగింది! వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా గణాంకాల ప్రకారం.. 2025 ఏప్రిల్‌జూన్ కాలంలో భారతీయులు 139.7 టన్నుల బంగారం కొనుగోలు చేయగా, 2026 నాటి అదే సమయానికి ఇది 131.4 టన్నులకు పడిపోయింది. అంటే కొనుగోలు చేసిన పసిడి పరిమాణం 6 శాతం (సుమారు 8.3 టన్నులు) తగ్గింది. కానీ ధరలు పెరగడం వల్ల ఈ బంగారం విలువ ఏకంగా రూ. 1,32,500 కోట్ల నుంచి ఒక్కసారిగా రూ. 1,98,100 కోట్లకు చేరింది. అంటే కేవలం మూడు నెలల వ్యవధిలోనే మనవాళ్లు అదనంగా రూ. 65,600 కోట్లు పసిడిపై వెచ్చించారు.

### ఇన్వెస్ట్‌మెంట్ హిట్!

పెరిగిన ధరల దెబ్బ ఆభరణాల విక్రయాలపై స్పష్టంగా కనిపించింది. పసిడి నగలు కొనేవారు తక్కువ బరువు, తక్కువ క్యారెట్ల నగల వైపు మొగ్గు చూపడం లేదా పాత బంగారాన్ని ఎక్స్చేంజ్ చేసుకోవడం ప్రారంభించారు. దీంతో నగలకు సంబంధించి పసిడి కొనుగోలు బరువు 88.8 టన్నుల నుంచి 75.1 టన్నులకు (15 శాతం) తగ్గింది. అయితే నగలకు పెట్టిన వ్యయం మాత్రం రూ. 84,200 కోట్ల నుంచి రూ. 1,13,210 కోట్లకు (34 శాతం పెరిగి) ఎగబాకింది. మరోవైపు బిస్కెట్లు, నాణేల రూపంలో పెట్టుబడి పెట్టేవారి సంఖ్య 9 శాతం పెరిగి 50.3 టన్నులకు చేరగా, డిజిటల్ బంగారం లేదా గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి ఏకంగా 136 శాతం గరిష్ఠ విలువ పెరిగి సరికొత్త రికార్డు సృష్టించింది.

### కొనుగోళ్లు మరింత జోరు

భారతీయులు తమ ఆర్థిక భద్రత కోసం బంగారాన్ని అత్యంత సురక్షితమైన మార్గంగా భావిస్తారని నివేదిక స్పష్టం చేస్తోంది. రాబోయే పండుగలు, వివాహాల సీజన్లలో బంగారం డిమాండ్ మరింత ఊపందుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ధరల హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, ఈ ఏడాది మొత్తానికి భారతదేశంలో పసిడి వినియోగం 650 నుంచి 750 టన్నుల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వెల్లడించింది.




# క్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజకీయ వేడి

- **చైర్‌పర్సన్ ఎన్నికల నుంచి కొనసాగుతున్న విభేదాలు..**
- **అభివృద్ధిపై ప్రభావం?**

**క్యాతనపల్లి, మహా:** క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ ఎన్నికల సమయం నుంచి రాజకీయ వాతావరణం వేడెక్కుతూ వస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు క్రమంగా బహిరంగ విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు దారితీశాయి. తాజాగా మున్సిపల్ అధికారుల వ్యవహారశైలి, పాలన, అభివృద్ధి పనుల అమలుపై కూడా ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. చైర్‌పర్సన్ ఎన్నికల సమయంలోనే మున్సిపల్ రాజకీయాల్లో నెలకొన్న పరిణామాలు ఆసక్తిని రేకెత్తించాయి. ఎన్నికల అనంతరం పాలకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారడం, వివిధ అంశాలపై సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం కొనసాగింది. దీంతో మున్సిపల్ పాలనపై రాజకీయ ప్రభావం పడుతోందన్న అభిప్రాయాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలో చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే రాజకీయ వర్గాల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా అభివృద్ధి అంశాల కంటే పరస్పర ఆరోపణలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు తాము ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నామని ఇరువర్గాల నాయకులు తమ తమ వాదనలు వినిపిస్తున్నారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్ వ్యవహారశైలిపై కూడా రాజకీయ దుమారం రేగింది. అధికారులపై రాజకీయ నాయకులు విమర్శలు చేయడం, అధికారులు తమ విధులకు ఆటంకాలు కలుగుతున్నాయని పేర్కొనడం వంటి పరిణామాలు మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ వ్యవహారంలో ఇరువర్గాలు తమకు అనుకూలంగా వాదనలు వినిపించాయి. బీఆర్ఎస్ వర్గం మున్సిపల్ పాలనలో తమపై అన్యాయం జరుగుతోందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం తగిన విధంగా స్పందించడం లేదని ఆరోపిస్తుండగా, కాంగ్రెస్ వర్గం మాత్రం అధికారులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని, ప్రభుత్వ యంత్రాంగం నిబంధనల ప్రకారం పనిచేయాల్సిందేనని పేర్కొంటోంది. ఈ రాజకీయ విభేదాల మధ్య సాధారణ ప్రజలు మాత్రం తమ సమస్యలు పరిష్కారం కావాలని కోరుకుంటున్నారు. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధిపై పాలకవర్గం, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. చైర్‌పర్సన్ ఎన్నికల నుంచి ఇప్పటివరకు చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే క్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజకీయ పోరు ఇంకా కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. అయితే ఈ పోరు ప్రజా సమస్యల పరిష్కారానికి అడ్డంకిగా మారకుండా, అభివృద్ధి అంశాలపై అన్ని వర్గాలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**ప్రజల సమస్యలే కేంద్రబిందువుగా..** రాజకీయ విభేదాలు ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం అన్నది పక్కనపెడితే, మున్సిపాలిటీ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తవడం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందడం ప్రధాన అంశంగా మారింది. ఇకపై అయినా రాజకీయ విమర్శలకు స్వస్తి పలికి, అభివృద్ధి కోసం పాలకవర్గం, ప్రతిపక్షాలు, అధికారులు కలిసి పనిచేస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు

- **అభివృద్ధి చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
- **పూరి గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతాం**
- **రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **చంద్రుగొండ మండలంలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు చేరవేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో మంత్రి పొంగులేటి విస్తృతంగా పర్యటించి రూ.1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా మంత్రి మంగయ్య బంజార గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో మంగయ్య బంజారు-గానుగపాడు రహదారిపై గ్రావెల్ రోడ్డు కల్వర్టు నిర్మాణం ఇల్లంగి బాబు ఇంటి నుండి కాజ్‌వే వరకు సీసీ రోడ్డు కాజ్‌వే నుండి గానుగపాడు రహదారి వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి 24 ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు ప్రకటించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం గ్రామీణాభివృద్ధి మహిళా సాధికారత యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పాలన సాగిస్తోందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8.21 లక్షల కోట్ల అప్పులతో వదిలి వెళ్లినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి ఇటీవల మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వయం సహాయక సంఘాలకు రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలను మంజూరు చేశామని మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పేదలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్నామని మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం రైతు సంక్షేమ కార్యక్రమాలు సామాజిక భద్రతా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహాల పథకం కింద తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల గృహాలు, రెండో విడతలో మరో 2.50 లక్షల గృహాలు మంజూరు చేసి మొత్తం 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా లక్ష ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఒక్క పేద కుటుంబం కూడా పూరి గుడిసెలో నివసించకుండా ప్రతి అర్హత కుటుంబానికి శాశ్వత గృహాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు అంతర్గత రహదారులు కల్వర్టులు తాగునీటి సదుపాయాలు ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చంద్రుగొండ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని తెలిపారు.

**పూరి గుడిసెల సర్వే పూర్తయింది..**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ చంద్రుగొండ మండలంలో ఇందిరమ్మ గృహాల కోసం పూరి గుడిసెల సర్వే పూర్తయిందని తెలిపారు. అర్హుల గుర్తింపు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం "ఫ్రైడే-డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం దోమల నివారణ తాగునీటి పరిశుభ్రత ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పనకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, పంచాయతీ అధికారి అనూష, గృహ నిర్మాణ శాఖ పిడి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

**గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం..**

అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మంగయ్య బంజార గ్రామం మొదటగా ఏకగ్రీవంగా ఎంపిక అయ్యిందని తెలిపారు. అప్పటి నుంచి గ్రామంలో మౌలిక వసతుల కల్పన సీసీ రోడ్లు తాగునీటి సదుపాయాలు గృహ నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో చంద్రుగొండ మండలానికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులను కూడా చేపడతామని తెలిపారు.





# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, మహా :** వాతావరణ శాఖ రానున్న 36 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పినపాక నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలు అనవసర ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువలు ఉప్పొంగుతున్న సమయంలో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని హెచ్చరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులు తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి ప్రజలకు సహాయం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్, తాగునీటి సరఫరా, రవాణా వ్యవస్థలకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సంరక్షణపై సూచనలు అందించడంతో పాటు, పశుసంవర్ధక శాఖ అధికారులు పశువుల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించి, వారి సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే పాయం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పాయం ఆదేశించారు.



# గాయపడిన బాధితులకు మంత్రి పరామర్శ

- **గాయపడిన బాధితులను పరామర్శించిన మంత్రి**
- **శిథిల ఇళ్లలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

**మంచిర్యాల, మహా:** జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద సూచించారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటి గోడ కూలిన ఘటనలో గాయపడిన బాధితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ. భాస్కర్ తదితర అధికారులతో కలిసి పరామర్శించారు. కోటపల్లి మండలం ఆలుగాం గ్రామంలో ఇంటి గోడ కూలి ఇద్దరు గాయపడగా, వారికి చికిత్స అందుతోందని మంత్రి తెలిపారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అవసరమైన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాల కారణంగా ప్రమాదకర స్థితిలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని, చెన్నూర్ నియోజకవర్గంలోని స్థానిక సంస్థల అధికారులకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. భారీ వర్షాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.

# వర్షా కాలంలో పరిశుభ్రతే రక్షణ

- **డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి...**
- **లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలి..**
- **మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ సూచన**




**మణుగూరు, మహా :** వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని మణుగూరు ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తప్పనిసరిగా మరిగించి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలని, తాజాగా వేడిగా తయారుచేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహార పదార్థాలను వీలైనంత వరకు నివారించడం ద్వారా అంటువ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, దోమతెరలు, దోమల నివారణ మందులు ఉపయోగించడంతో పాటు పూర్తి చేతుల దుస్తులు ధరించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలు, తీవ్రమైన తలనొప్పి లేదా శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపించినప్పుడు స్వయంగా మందులు వాడకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# కారేపల్లి కేంద్రంగా కల్తీ బంగారం వ్యాపారం...

- **రాష్ట్ర వ్యాప్తంగా అనేక బ్యాంకుల్లో పెట్టిన ముఠా**
- **కారేపల్లి కి చెందిన వ్యాపారే కీలక సూత్రధారి**
- **నకిలీ బంగారంతో కోట్లు గడించిన ముఠా**
- **200 మంది ఏజంట్లతో ముఠా కార్యకలాపాలు**
- **ముఠా మోసాలపై పోలీసుల ముమ్మర దర్యాప్తు**



**కారేపల్లి, మహా :** కేంద్రంగా నకిలీ బంగారం వ్యాపారం కలకలం రేపుతోంది..రాష్ట్ర వ్యాప్తంగా అనేక బ్యాంకుల్లో నకిలీ బంగారంతో అనేక మోసాలకు పాల్పడుతున్న ముఠా సూత్రధారి కారేపల్లికి చెందిన వ్యాపారి కావడంతో మండల వ్యాప్తంగా నకిలీ బంగారం విషయంపై జోరుగా చర్చ జరుగుతుంది. కారేపల్లికి చెందిన వ్యాపారి గత కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా 200 మందితో ఓ ముఠాను ఏర్పాటు చేసుకొని నకిలీ బంగారం వ్యాపారం చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ బంగారం విషయంలో కారేపల్లి పోలీసులు ఇటీవల ముమ్మర దర్యాప్తు చేపట్టి వ్యాపారికి సంబంధించిన బ్యాంక్ అకౌంట్లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కారేపల్లి మండలానికి చెందిన కొందరు ఇల్లందు బ్యాంకుల్లో నకిలీ బంగారాన్ని తాకట్టుపెట్టి విషయం బయటకు రావడంతో గుట్టు చప్పుడు కాకుండా డబ్బులు బ్యాంకుల్లో చెల్లించి నకిలీ బంగారాన్ని బయటికి తెచ్చిన విషయంలో కూడా ఇల్లందు పోలీసులు గతంలో విచారణ కూడా చేపట్టారు. బ్యాంక్ అధికారులు రికవరీ ఆలోచనతో ఫిర్యాదులు చేయకపోవడంతో ముఠా కార్యకలాపాలు ఇంతకాలం కొనసాగాయనే ఆరోపణలు ఉన్నాయి. నకిలీ బంగారం ముఠా గత కొన్నేళ్లుగా ఈ వ్యాపారం ముసుగులో అనేక మోసాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయల కూడగట్టినట్టుగా కూడా ప్రచారం జరుగుతుంది. ఈ ముఠా కార్యకలాపాలను నియంత్రించాలని కారేపల్లి పోలీసులు ముఠా సభ్యులపై నిఘా పెట్టి కీలకమైన సమాచారమే సేకరించినట్లుగా విశ్వసనీయంగా తెలుస్తోంది. వాటి ఆధారంగానే పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో నకిలీ బంగారంతో మోసాలకు పాల్పడుతున్న ముఠా వ్యవహారాలన్నీ త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# బసంతనగర్‌లో వాన బీభత్సం

- **జలమయమైన వార్డు-1 ఇళ్లలోకి చేరిన నీరు**



**బసంత్ నగర్, మహా:** పెద్దపల్లి, జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బసంతనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని 1వ వార్డు జలమయమైంది.భారీ వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానిక నివాసి చంద ప్రశాంత్ కుటుంబం మరియు వారి పక్క ఇండ్లల్లో కూడా నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఇల్లు పూర్తిగా ఇంట్లోని నిత్యవసరాలు,సామగ్రి తడిసిపోయి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు మారుతి నగర్ ప్రాంతంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక కాలనీల్లోనే నిలిచిపోతోందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా, అధికారులు శాశ్వత పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే డ్రైనేజీలు నిర్మించి, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కాలువలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అధికారులు తక్షణమే స్పందించివర్షం ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నిలిచిన నీటిని తొలగించాలని, ఇళ్లలోకి నీరు చేరి నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న పాత ఇళ్లను గుర్తించి, అందులోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు.

# అధిక వర్షపాతం వరి, పత్తి రైతులు జాగ్రత్త వహించాలి

- **పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్.**



**పాలకుర్తి, మహా:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తిమండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరి, పత్తి పంటల్లో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రస్తుతం 2,782 ఎకరాల్లో పత్తి, 9,678 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను 6,100 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని, మరో 3,578 ఎకరాల్లో వరి నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం ఇంకా పూర్తిగా తొలగలేదని, రేపటి నుంచి మళ్లీ బెట్ట పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉనందున రైతులు తొందరపడి వరి నాట్లు వేయవద్దని, ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.వర్షాల వల్ల పంట చేన్లలో నీరు నిలబడితే భారీ నష్టం జరుగుతుందని ఏఓ హెచ్చరించారు. వరి పొలంలో 3 నుండి 4 అంగుళాల కంటే ఎక్కువ నీరు ఉంటే వెంటనే బయటకు పంపాలి,వర్షం ఆగిన 23 రోజుల తర్వాత ఎకరాకు 5 నుండి 10 కిలోల యూరియా, 5 కిలోల పొటాష్ వేసుకోవాలి. పొటాష్ వేయడం వల్ల కాండం గట్టిపడి పంట పడిపోకుండా ఉంటుంది.బ్లాస్ట్, బ్యాక్టీరియా ఆకు కుళ్ళు తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 'ట్రైసైక్లోజోల్' 0.6 గ్రాములు లేదా 'కాపర్ ఆక్సీక్లోరైడ్' 3 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.రైతులందరూ ఈ సూచనలు తప్పనిసరిగా పాటించి పంటలను కాపాడుకోవాలని, సలహాలు సందేహాల కోసం స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారిని ఏఈఓ సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు





# అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కొత్తగూడెం, మహా:మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పాల్వంచ నందు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ తుకారం రాథోడ్, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లెనినా, సఖి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు. మానవ అక్రమ రవాణా ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల మాటలను నమ్మవద్దని ఎవరైనా మోసపూరితంగా లేదా బలవంతంగా తమను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే వెంటనే గట్టిగా అరుస్తూ చుట్టుపక్కల వారి సహాయం కోరాలని సూచించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం తీసుకోవాలని కోరారు. హెల్ప్‌లైన్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాల్వ సుధాకర్ రావు, జిల్లా అధ్యక్షుడు మాలోత్ రామ్‌ధాస్ నాయక్, జిల్లా సలహా కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భారత ఉన్నత విద్యా వ్యవస్థలో ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయ మంజూరి సంఘం (యు జి సి) అటానమస్ (స్వయంప్రతిపత్తి) హోదాను మంజూరు చేసింది. ఈ హోదా 2026-27 విద్యా సంవత్సరం నుండి 2030-31 విద్యా సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల కాలానికి అమలులో ఉండేలా యూజీసీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.పద్మ హర్షం వ్యక్తం చేస్తూ కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన అధ్యాపక బృందం బోధనేతర సిబ్బంది విద్యార్థులు పూర్వ విద్యార్థులుసిపిడిసి సభ్యులు తల్లిదండ్రులు ఉన్నత విద్యాశాఖ అధికారులు ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన సహకార ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఐక్యుఏసి కోఆర్డినేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ అటానమస్ హోదా ద్వారా విద్యార్థులకు సమకాలీన అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికలు నైపుణ్యాధారిత కోర్సులు వినూత్న బోధనా విధానాలు పరిశోధన ఉపాధి అవకాశాలకు అనుసంధానమైన విద్యను అందించే అవకాశం మరింత విస్తృతమవుతుందని తెలిపారు. కళాశాల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ హోదా కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు.అటానమస్ హోదా సాధించడం ద్వారా శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా రంగంలో మరో చారిత్రక విజయాన్ని తన ఖాతాలో నమోదు చేసుకుంది. భవిష్యత్తులో నాణ్యమైన ఉన్నత విద్య పరిశోధన ఆవిష్కరణలకు కేంద్రంగా కళాశాలను తీర్చిదిద్దేందుకు యాజమాన్యం అధ్యాపకులు సమిష్టిగా కృషి చేస్తామని కళాశాల యాజమాన్యం వెల్లడించింది.



# స్కూల్ యూనిఫాంలు త్వరలో అందించండి

- **అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి జూలై 30 మహా** మధ్యాహ్న భోజనం పథకం లో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లు త్వరగా అందించాలని యాదాద్రి భువనగిరి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం పోచంపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ), మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించారు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యం, వంటగది నిర్వహణను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీటి సౌకర్యం, వంటశాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. యూనిఫాంల కుట్టు పనులను మరింత మంది టైలర్లను వినియోగించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అన్ని యూనిఫాంలను సిద్ధం చేసి విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# దళితులను కులం పేరుతో అవమానించొద్దు

- **ఆలేరు తాసిల్దార్ వలిగొండ ఆంజనేయులు**

**ఆలేరు , మహా :** కులం పేరుతో అవమానించరాదని ఆలేరు తహసిల్దార్ వలిగొండ ఆంజనేయులు అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్ల గూడెం లోని ఎస్సీ కాలనీలో గురువారం నాడు సర్పంచ్ ఏసి రెడ్డి మంజుల మహేందర్ రెడ్డి అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు... ఈ సమావేశంలో తహసిల్దార్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలను కులం పేరుతో దూషించరాదని, కుల మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని తెలిపారు... కార్యక్రమం అనంతరం ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్ కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు ఈ సమావేశంలో దళితుల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి శైలజ రేఖల, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పూర్ణచందర్ రావు, పంచాయితీ సెక్రెటరీ శశికాంత్ గౌడ్, గ్రామ పాలన అధికారి శ్రీనివాస్ తో పాటు ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గంపల విజయ్ ఎర్ర మహేష్ పాల్గొన్నారు.



# తర్నం బ్రిడ్జిని పరిశీలించిన ఎస్పీ

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జైనథ్ మండలం తర్నం గ్రామం సమీపంలోని అండర్ బ్రిడ్జి పై నుండి నీరు ప్రవహిస్తోంది. దీంతో నేషనల్ హైవే353Bపై వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి రహదారిపై నెలకొన్న పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్‌ను నియంత్రించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అలాగే వర్షాల కారణంగా జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, కల్వర్టుల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అవసరమైతే ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రయాణాలు చేయవద్దని, పోలీసు శాఖ జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా అత్యవసర సేవలకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ జి శ్రావణ్, ఎస్ఐ పి గౌతమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణతో సింగరేణి ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి

- **సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు**
- **అప్రెంటిస్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానం**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న అప్రెంటిస్ శిక్షణ యువతకు నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా వారి భవిష్యత్ ఉపాధికి బలమైన పునాదిగా నిలుస్తుందని సింగరేణి డైరెక్టర్(పి అండ్ పి)కే.వెంకటేశ్వర్లు తెలిపారు. సింగరేణి సంస్థలో ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి కోసం కొత్తగూడెం ఏరియా లోని 3 ఇన్‌క్లైన్ నందు ఏర్పాటు చేసిన ట్రైనింగ్ సెంటర్ ను గురువారం డైరెక్టర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న అప్రెంటిస్ శిక్షణ యువతకు నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా వారి భవిష్యత్ ఉపాధికి బలమైన పునాదిగా నిలుస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకున్న యువతకు ఉద్యోగావకాశాలు మరింత విస్తృతంగా లభిస్తాయని అప్రెంటిస్ శిక్షణ ఆ దిశగా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. జీవీటీసీ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం భద్రతా ప్రమాణాలపై నిరంతర శిక్షణ అందించడం వల్ల ఉద్యోగుల సామర్థ్యం ఉత్పాదకత భద్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. తర్వాత ఆయన జీవీటీసీ శిక్షణా కేంద్రంలోని తరగతి గదులు ఆధునిక శిక్షణా పరికరాలు భద్రతా సదుపాయాలను పరిశీలించారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో విటిసి నందు 2084 మంది సింగరేణి ఎంప్లాయ్స్ 4952 మంది కాంట్రాక్ట్ వర్కర్స్ మొత్తంగా 7036 శిక్షణ పొందినట్లు తెలిపారు. నాణ్యమైన శిక్షణతో పాటు విలువైన పని అనుభవాన్ని అందించడం ద్వారా సింగరేణి సంస్థ దేశానికి నైపుణ్యం కలిగిన వారిని అందిస్తోందన్నారు. శిక్షణతో పొందిన విజ్ఞానాన్ని ఉద్యోగ జీవితంలో సమర్థవంతంగా వినియోగించి సంస్థలకు సమాజానికి ఆదర్శంగా నిలవాలని అభ్యర్థులకు పిలుపునిచ్చారు. అలాగే నిరుద్యోగులకు స్కిల్ డేవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తు 20252026సంవత్సరంలో సింగరేణి సంస్థ ఆద్వర్యంలో జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్(శంషాబాద్)లో కొంతమందికి ఈ ఫౌండేషన్ ద్వారా ఉద్యోగాలు లబించినట్లు తెలుపుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అప్రెంటిస్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తో పాటు జీఎం హెచ్ఆర్‌డి ఆర్.విజయ ప్రసాద్, జీఎం షాలెం రాజు, వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహరావు, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్.ఓ టు జీఎం గోవిందరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏజీఎం (ఫైనాన్స్)బీభత్స, ఏజీఎం(సివిల్)రామకృష్ణ, కె.రాజారాం, ఏరియా ఇంజనీర్ వి.రామకృష్ణ, విటిసి మేనేజర్ లక్ష్మణ్, డి జిఎం(ఈ అండ్ ఏం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, మేనేజర్(ఐటి) శేషశ్రీ, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ బి.తౌర్య, ఎస్ ఈ చంద్రశేకర్, సీనియర్ పిఓ మజ్జి మురళి, ఏరియా అధికారులు, అప్రెంటిస్ అభ్యర్థులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల పీఈటీలతో సమీక్ష సమావేశం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు ఆగస్టు 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ ప్రధాన వేడుకలలో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణపై కొత్తగూడెంలోని వివిధ పాఠశాలల కళాశాలల నుండి వచ్చిన పిఈటిలతో డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణరావు, బి.శివ కేశవరావు, పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల కళాశాలల నుండి వచ్చిన పీఈటీలతో స్వాతంత్ర్య దినోత్సవ ప్రధాన వేడుకలలో ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల గురించి ఎవరెవరు ఏమేమి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారో ఎంత మంది విద్యార్థులు పాల్గొంటారో వివరముగా అడిగి తెలుసుకున్నారు. ఈ వేడుకలలో తెలంగాణ సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శించి కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో సహాయ పడాలని అన్నారు.
ఈ కార్యక్రమములో డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, బి.శివ కేశవరావు, డివై.పిఎం కే.శివ కుమార్, వెల్ఫేర్ పిఏ వర ప్రసాద్, సీనియర్ పిఓ మండల శ్రీనివాస్, బిఎస్‌జి కొ ఆర్డినేటర్ పి.సాయి నిరంజన్, సీనియర్ రోవర్ స్కౌట్ లీడర్లు వి.వెంకట స్వామి, ఎల్.గోపాల కృష్ణయ్య, ఎం.కొమరయ్య, మెంగని అశోక్, కే.వి.ప్రసాద్, పాఠశాలల కళాశాలల నుండి వచ్చిన పిఈటిలు పాల్గొన్నారు.



# అత్యవసర సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు

**అదిలాబాద్ మహా** : ఆదిలాబాద్ పట్టణంలో భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తో కలిసి పలు కాలనీల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. బంగారిగూడ, డైట్ గ్రౌండ్, మణిపూర్ కాలనీ, దస్నాపూర్, రాంనగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదిలాబాద్ పట్టణానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో పట్టణ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుండి బయటకు రావద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని సూచించారు.ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు అదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 9000018842ను సంప్రదించి సహాయం పొందాలని కోరారు.పట్టణంలో మూడు షిఫ్టుల్లో మున్సిపల్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, అవసరమైన చోట్ల జేసీబీలు, అత్యవసర స్పందన బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.వర్షపు నీరు నిల్వ కాకుండా ఓపెన్ ప్లాట్లలో జేసీబీల సహాయంతో నీటిని తొలగిస్తున్నామని తెలిపారు. ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు తమ ప్లాట్లలో డిస్మెంటిల్ మెటీరియల్, వేస్ట్ మెటీరియల్, మట్టి లేదా మోరం వేసి నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల దోమల వ్యాప్తి తగ్గడంతో పాటు చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు కలగవని చెప్పారు.అదేవిధంగా నాలాలు, వాగులు, నీటి ప్రవాహ మార్గాల పై ఎవరైనా అక్రమ నిర్మాణాలు లేదా అడ్డంకులు ఏర్పాటు చేసి ఉంటే వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని హెచ్చరించారు. లేకపోతే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు వాటిని తొలగించే చర్యలు చేపడతారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఎస్ఐ శంకర్, నరేందర్ , నారాయణ రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ అవి కిరణ్, వెంకటేష్, వార్డ్ కౌన్సిలర్లు మంగేష్, దత్తు,కాలనీ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లాకు రెడ్ అలర్ట్

- **అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు**
- **పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ ఎస్పీ**

**అదిలాబాద్ మహా**: జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం తాంసి మండలం భీమన్న వాగు కల్వర్టు ప్రాంతాన్ని, మత్తడి వాగు ప్రాజెక్ట్ ను ఎస్పీ ఖిల్ మహాజన్ తో కలిసి ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల వేళ ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో గత 24 గంటల్లో సగటున 60 మి.మీ వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ఇచ్చోడ, బజార్‌హత్నూర్ పరిధిలో 10నుంచి 11 సెంటీమీటర్ల మేర భారీ వర్షం కురిసిందని తెలిపారు. మత్తడి వాగు ప్రాజెక్టు వద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో దిగువ ప్రాంత ప్రజలను ముందస్తుగానే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. వాగులు, చెక్ డ్యామ్‌ల వద్ద పొంగిపొర్లుతున్న లోలైన్ కాజ్‌వేల వద్ద ప్రమాదాలు జరగకుండా గ్రామ పంచాయతీ అధికారులు, పోలీసుల భాగస్వామ్యంతో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు. వర్షాల వేళ ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, ప్రాజెక్టుల వద్దకు చేపల వేటకు వెళ్లడం గానీ, యువత ప్రమాదకర రీతిలో 'రీల్స్' చేయడం గానీ చేయకూడదని, అలాంటి చర్యలపై కఠిన ఆంక్షలు అమలులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ విషయమై గ్రామ పంచాయతీల్లో చాటింపు ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.పాతపడిపోయిన, మట్టిగోడలు కలిగిన ప్రమాదకర ఇళ్లలో నివసిస్తున్న వారిని గుర్తించి, వారిని బంధువుల ఇళ్లకు లేదా పంచాయతీల్లో ఏర్పాటు చేసే తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 12 గంటల పాటు జిల్లా రెడ్ జోన్ పరిధిలోనే ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1939 లేదా 100 నంబర్‌కు సంప్రదించాలని, జిల్లా యంత్రాంగం నిరంతరం సహాయక చర్యలకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.ఈ పర్యటనలో తాంసి, తలమడుగు తహసీల్దార్లు గణేష్, రాజ్ మోహన్, నీటి పారుదల శాఖ అధికారులు ఈఈ నరేష్, డిఈఈ శ్రీనివాస్ రావు, ఏఈఈ హరీష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కడెం ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ

**నిర్మల్ మహా:** జిల్లాలో మొన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాబోయే రెండు రోజుల పాటు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే కడెం ప్రాజెక్టు, ఇతర వాగులు, వంకలు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు, మత్స్యకారులు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆపత్కాల పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ పీడీ విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కడెం మండల అధికారులు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఎస్ఐఆర్'లో సత్తుపల్లి సత్తా

- **జిల్లాలో రెండో స్థానం సాధించిన సత్తుపల్లి నియోజకవర్గం**



**సత్తుపల్లి, (మహా):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గం జిల్లాలో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమాలు, బూత్ స్థాయి సమన్వయం, రెవెన్యూ అధికారుల సహకారం ఈ ఫలితానికి ప్రధాన కారణమని ఎమ్మెల్యే తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించామని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, బూత్ సిబ్బంది సమిష్టిగా పనిచేయడంతో నియోజకవర్గం జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిందని చెప్పారు. నియోజకవర్గంలోని వేంసూరు మండలం ఎస్ఐఆర్ అమలులో జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, గ్రామ సర్పంచ్ ఎం.డి. ఫక్రుద్దీన్ సహకారంతో అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ఈ విజయాన్ని సాధించారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో కృషి చేసిన వేంసూరు మండల ఎమ్మార్వో, బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# భద్రతా పక్షోత్సవంలో కిష్టారం ఓసీకి ద్వితీయ బహుమతి

- **ఓవరాల్ పర్ఫార్మెన్స్‌లో ప్రతిభ.. ఉద్యోగుల సమష్టి కృషికి గుర్తింపు**

**సత్తుపల్లి, జూలై 30: మహ :.** సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం-2025లో సత్తుపల్లి ఏరియాలోని కిష్టారం ఓసీ ప్రాజెక్టు సత్తా చాటింది. గ్రూప్-III ఓసీ గనుల విభాగంలో ఓవరాల్ పర్ఫార్మెన్స్‌లో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం కిష్టారం ఓసీ ప్రాజెక్టులో ప్రాజెక్టు అధికారి ఏ.ఎల్.ఎస్.వి. సునీల్‌వర్మ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి, గని మేనేజర్ బి. రామకృష్ణ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఉద్యోగిని అభినందించారు. భద్రతా ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ, ప్రమాద రహిత పని వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేసి విజయోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ మేనేజర్ వల్లమల్ల బాబు, సేఫ్టీ ఆఫీసర్ గోపికిశోర్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ కిశోర్ కుమార్, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రెటరీ షణముఖచారితో పాటు అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, డీఎల్ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

మహా పత్రిక
తెలుగు
శుక్రవారం, హైదరాబాద్ | 31-07-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM




## ఉప్పరిగూడలో మద్యపాన నిషేధానికి తీర్మానం.!

**ఇబ్రహీంపట్నం జూలై 30 మహా:** ఉప్పరిగూడ గ్రామంలోని ప్రజలు మద్యపానానికి బానిసలుగా మారి తమ యొక్క బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని గ్రామ సర్పంచ్ శ్రీవేణి తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో మద్యం అమ్మకాలపై నిషేధం విధించాలని గ్రామసభలో పంచాయతీ పాలకవర్గం తీర్మానించడం జరిగిందని గ్రామ సర్పంచ్ బోసుపల్లి శ్రీవేణి నందకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ... గురువారం గ్రామసభలో గ్రామ ప్రజల వినతుల మేరకు బెల్ట్ షాప్ లలో మద్యం అమ్మకాలు జరపవద్దని తీర్మానించడం జరిగిందన్నారు, గ్రామంలోని ప్రజలు మద్యపానానికి బానిసలుగా మారి తమ యొక్క బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామంలో మద్యపానం అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామసభలో తీర్మానించడం జరిగిందన్నారు. గ్రామంలో మద్యపానం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు కూడా విధిస్తామన్నారు. అనంతరం బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు జరుపుతున్న వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని అన్నారు.

# ప్రభుత్వ పథకాలు పేదల గడపకు చేర్చే బాధ్యత అధికారులదే

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి....
- మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష



**ఇబ్రహీంపట్నం జూలై 30 మహా**:పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చే బాధ్యత అధికార యంత్రాంగంపైనే ఉంటుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. బుధవారం సాయంత్రం మంచాల మండల పరిషత్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. దాదాపు ఇరవై శాఖలకు పైగా అధికారులు, సర్పంచులు ఈ సమావేశానికి హాజరుకాగా... ఒక్కో శాఖ పనితీరు గురించి చీకటి పడే వరకు ఆరా తీశారు. అక్రమ కార్యకలాపాలకు అధికారులెవరూ సహకరించవద్దని సూచించారు. నేరాల కట్టడిపై ఏసీపీ రాజు సూచనల మేరకు ప్రతీ గ్రామంలో ప్రవేశమార్గం, కీలక ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. పశువైద్య శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సేవలందిస్తున్నందున ప్రతీ పర్యటన, అందించిన సేవలపై రికార్డు నమోదు చేయాలని చెప్పారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలుండగా... ఎంతమంది సెక్రటరీలు హాజరయ్యారని ఆరా తీసిన ఎమ్మెల్యే... పథకాల అమలు విషయంలో కార్యదర్శులదే కీలకపాత్రగా పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల అమలుపై ప్రతీ 45రోజులకొకసారి నివేదిక తయారు చేయాలని చెప్పారు. పేదల గడపకు సర్కార్ ఫలాలు అందితేనే సమాజశ్రేయస్సు సాధ్యమని చెప్పారు. ప్రభుత్వం ఇరవైనాలుగు గంటల కరెంటు అందిస్తున్న తరుణంలో విద్యుత్ కోతలు ఉండవద్దని ఎమ్మెల్యే తెలిపారు. ఏదైనా కారణంతో నిలిపివేయాల్సి వస్తే ముందస్తుగా తప్పకుండా సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులకు సూచించారు. కరెంటు కోతల విషయంలో గ్రామపంచాయతీల్లో ప్రత్యేక రికార్డు నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. విద్యుత్ సరఫరా విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని చెప్పారు.

**వైద్యసేవలలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించవద్దు...**

నియోజకవర్గంలో వైద్యసేవల అంశంపై ఇటీవల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షను గుర్తుచేసిన ఎమ్మెల్యే.... దానికి సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రాల్లో ఖాళీ పోస్టులు, సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యసేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్య ధోరణి



ప్రదర్శించవద్దని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందజేత, అంగన్ వాడీ సేవల గురించి ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడారు. అలాగే, ఎక్సైజ్, ఆర్ అండ్ బీ, వ్యవసాయం, రెవెన్యూ తదితరశాఖలపై ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలపై అధికారులతో ఆరా తీశారు. విధుల నిర్వహణలో ఎవరికీ లాలూచీ పడాల్సిన అవసరంలేదని చెప్పిన ఎమ్మెల్యే... పదేళ్లలో జరిగిన నష్టాన్ని పూడ్చుతూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అన్నిశాఖలు సమన్వయంతో సాగాలని సూచించారు.



## జ్ఞానశీల ఏకత గురుపూజోత్సవ ప్రత్యేకత

**సద్గురు శ్రీశ్రీశ్రీ శివానంద మహారాజ్**

**కుషాయిగూడ, మహా :** సమాజంలో చిమ్మ చీకటిని, అజ్ఞానాన్ని తొలగించేది గురువేనని, గురువులకు గౌరవప్రదమైన విలువనివ్వాలని, గురువులను గౌరవించినప్పుడే గురువుకు ప్రతిష్ట దక్కుతుందని సద్గురు సద్గురు శ్రీ శ్రీ దాదాజీ శివానంద మహారాజ్ మహారాజ్ అన్నారు. బుధవారం రాత్రి కుషాయిగూడ శివాంజనేయ దేవస్థానం హనుమాన్ కాలనీ శిశు మందిర్ స్కూల్ దగ్గర కుషాయిగూడలో గురు పౌర్ణమి మహోత్సవానికి ముఖ్యఅతిథిగా సద్గురు మహారాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ నేడు సమాజంలో సమాజంలో మానవ విలువలు పతనమై మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా పరిగణించబడ్డాయన్నారు. అంధకారాన్ని తొలగించి జ్ఞానమును వెలుగును ప్రసాదించేవారే నిజమైన గురువులని అన్నారు. గురు పౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా పిలుస్తారని, గురువులను పూజించడానికి అత్యంత ప్రతిష్టమైన రోజు వ్యాస పౌర్ణమిని వ్యాసమహర్షి జన్మదిన సందర్భంగా జరుపుకునే పండుగని గురు పౌర్ణమి అంటారన్నారు. మహాభారతంతో పాటు 18 పురాణాలను, ఉప పురాణాలను లోకానికి అందించిన జ్ఞాపకార్థంగా వ్యాస పౌర్ణమి అని పిలుస్తారని తెలిపారు. వ్యాసమహర్షి గురు దక్షిణామూర్తిని గురు పరంపరనే గురువులుగా భావిస్తారని శ్రీ శ్రీ శ్రీ సద్గురు శివానంద మహారాజ్ పేర్కొన్నారు. గురువులతోపాటు తల్లిదండ్రులను కూడా మంచిగా చూడాలని, వారిని వేధించకుండా ప్రేమాభిమానాలతో చూడగొనాలని తల్లిదండ్రుల కు మనము విలువ ఇచ్చిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు వరికుప్పల మల్లేష్, ఉపాధ్యక్షులు మల్యాల గణేష్, రమేష్‌భాస్కర్ ప్రసాద్, శివాజీ, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, భక్తులు ఆలయ కమిటీ సభ్యులు. సాయి ప్రసాద్, మనోజ్, మన్నే జయంత్, వినోద్ రాకేష్ ఎడ్ల రాకేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.




## పేదలకు ఇళ్ల పట్టాల అందించాలి: గ్యార మల్లేష్

- దండుమైలారంలోని రిలే నిరాహార దీక్షకు మద్దతు
- ప్రభుత్వ భూమిని కాపాడాలన్న బిఎస్పి నాయకులు

**ఇబ్రహీంపట్నం జూలై 30 మహా**: దండుమైలారం గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు అందించి, ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని బీఎస్పి జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ అధ్యక్షులు గుండె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఛలో దండుమైలారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలం, దండుమైలారం గ్రామంలో గ్రామ కంఠం భూమి భూ కబ్జాదారుల చేతిలో అన్యాక్రాంతమయ్యిందని, గత ఆరు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న గ్రామ ప్రజలకు మద్దతుగా, బీఎస్పీ జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్, కార్యవర్గ సభ్యులు చిత్రం కృష్ణ, పలువురు నాయకులు సంఘీభావం తెలుపుతూ, ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనపరచుకొని, గ్రామంలో ఇండ్లు లేని పేదలకు 60 గజాల చొప్పున పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూకబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇంచార్జ్ బంగరిళ్ళ మహేందర్, సోషల్ మీడియా కన్వీనర్ యంజల్ ప్రహ్లాద్, నియోజవర్గ కార్యదర్శి చెక్క సతీష్ మహారాజ్, చెరుకూరి కరుణాకర్, గట్టు నరసింహ, పెద్దమొత్తని గణేష్, కొంద్రు కరుణాకర్, పంగ శ్రీశైలం,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## యశోద ఆసుపత్రి వైద్యుల అరుదైన చికిత్స

**రాజేంద్రనగర్ మహా ;** యశోద హాస్పిటల్స్ శంషాబాద్ వైద్యులు, పుట్టుకతోనే ఎడమ అండాశయంలో పెద్ద సిస్ట్ తో జన్మించిన ఫ్రీట్మర్ అడ శిశువుకు పిడియాట్రిషియన్,నియోనాటాలజీస్ట్ డా, ప్రశాంత్ బాబు నేతృత్వంలో శిశువుకు లాపరోటమి ద్వారా అండాశయ సిస్ట్ కు మార్సుపియలైజేషన్ శస్త్ర చికిత్సను మలక్ పేట్ యశోద ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించామని యశోద ఆస్పత్రి వైద్యులు శంషాబాద్ కార్యాలయంలో తెలిపారు.చికిత్స అనంతరం శిశువుకు నిపుణుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందించారు. సోడియం లోపాన్ని సరి చేసి, తల్లిపాలను పూర్తిస్థాయిలో నవజాత శిశువుకు అందించారు. పొత్తికడుపును నిరంతరం పర్యవేక్షిస్తూ ఇన్ఫెక్షన్ రాకుండా జాగ్రత్తలు వహించారు.



## విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండలం పాలమాకులలోని మోడల్ స్కూల్‌లో మండల వ్యవసాయ అధికారి శ్వేత ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల విధానం, వాటి ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ సంచాలకులు మహేశ్వరి, రాజేంద్రనగర్ సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ వ్యవసాయ అధికారుల బృందంతో కలిసి విద్యార్థులకు శిక్షణ అందించారు.ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ మట్టి నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం వల్ల నేల సారాన్ని ఖచ్చితంగా అంచనా వేయవచ్చని తెలిపారు. మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా ఏ నేలలో ఏ పంటలు సాగు చేయాలి, ఎరువులను ఎంత మోతాదులో వినియోగించాలి, దిగుబడిని ఎలా పెంచుకోవచ్చనే అంశాలను విద్యార్థులకు వివరించారు.రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్కారం వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మన్న, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

రాజేంద్రనగర్, మహా: రానున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్, రెవెన్యూ, జలమండలి తదితర శాఖలు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు పూర్తిచేయడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నిమజ్జనం జరిగే చెరువులు, కృత్రిమ కుంటల వద్ద తగినన్ని క్రేన్లు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు, జీహెచ్ఎంసీ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులను చదవడం, రాయడంలో ఉత్తమంగా తీర్చిదిద్దాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ, మహా ;** విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా, చదవడం, రాయడం, భావవ్యక్తీకరణలో మెరుగైన నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల కుమారిని కలెక్టర్ పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంతమంది కొత్తగా ప్రవేశాలు పొందారని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు చేపడుతున్న చర్యల పై ఆరా తీశారు. పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో ఉపాధ్యాయులకు బోధనలో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, విద్యార్థి కేంద్రిత అభ్యాస విధానాలు, ప్రాథమిక భాషా మరియు గణిత నైపుణ్యాల పెంపు, నిరంతర మూల్యాంకన విధానాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించడం తో పాటు పాఠశాలలో ఉన్న లైబ్రరీని పరిశీలించి ఉపాధ్యాయులతో చర్చించారు. అలాగే వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండుతున్న భోజన పదార్థాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న టాయిలెట్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ విద్యార్థులు విద్యా ప్రగతిలో ఉత్తమంగా నిలవాలంటే పాఠ్యాంశాన్ని బోర్డు మీద రాయడం కాకుండా డిక్టేషన్ గా ఉపాధ్యాయులు చెప్పడం ద్వారా విద్యార్థులు సొంతంగా రాయడం, చదవడంపై పట్టు సాధించగలరని అన్నారు. విద్యార్థులను ఇంగ్లీషులో బాగా రాయడం, చదవేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, ఎంఈఓ విజయ్ కుమార్, తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## యాదగిరిగుట్ట సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

**యాదాద్రి భువనగిరి, మహా**: జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ గురువారం యాదగిరిగుట్ట సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. కార్యాలయ నిర్వహణ, నేరాల నమోదు, పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు ూచనలుచేశారు.అనంతరంతుర్కపల్లి,రాజాపేట, మోటకొండూరు, గుండాల పోలీస్ స్టేషన్ల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎస్పీ, నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర సేవలు అందిస్తూ పోలీస్ స్టేషన్లను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు.



## ప్రతి రోగికి మెరుగైన చికిత్స అందాలి

- వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**హనుమకొండ, మహా ;** హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.గురువారం ఆత్మకూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ విభాగం, మందుల నిల్వ గది, ల్యాబ్, ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్, అబ్జర్వేషన్ వార్డులు, టీకాల నిల్వ కేంద్రం, రికార్డుల నిర్వహణ,ఓపీ నమోదు విధానం, వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, మాతా శిశు సంరక్షణ సేవల రికార్డులను పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓపీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ సకాలంలో వైద్యం అందించాలన్నారు. ఓపీ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గర్భిణులకు నాణ్యమైన మాతాశిశు ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఫార్మసీలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా ప్రతి ఉద్యోగి సేవాభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ స్పందన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్**

**వలిగొండ, మహా :** భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షులు సీనియర్ నాయకులు పాశం భాస్కర్ అన్నారు గురువారం పదాధికారుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాలలో పార్టీ నిర్మాణం బలంగా ఉన్నప్పుడే పార్టీ ప్రతిష్టంగా ఎదుగుతుందని అందుకు అనుగుణంగా ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పనిచేయాలని అన్నారు సమావేశానికి మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో రాచకొండ కృష్ణ రామ నర్సు బంధారపు లింగస్వామి కందుల తానేష్ మంద నరసింహ బంధారపు రాములు రావుల పద్మా రెడ్డి బచ్చ శ్రీనివాస్ రంజిత్ రెడ్డి గంగదారి దయాకర్ దంతూరి అరుణ్ వీరాచారి మహేష్ తదితరులు పాల్గొన్నారు

## సమయపాలనను ప్రతి ఉద్యోగి పాటించాలి

**జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా**

**వరంగల్, కార్పొరేషన్ మహా;** జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలను సందర్శించి సిబ్బంది హాజరు నమోదులు, కార్యాలయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా కార్యాలయ సమయపాలన తప్పనిసరిగా పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించి, పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ వెంట పర్యవేక్షకులు సంతోష్ తదితరులు ఉన్నారు.





# అంగన్వాడీలు సంక్షేమ సేవలు సమర్ధవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి జూలై 30 మహా :** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా జరుగుతున్న సంక్షేమ సేవలు మరింత సమర్ధవంతంగా అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హల్ లో జిల్లా మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో బాల్య వివాహలు, త్రీవ్ర లోప పోషణ ఉన్నా పిల్లలు, రక్తహీనతతో ఉన్న గర్భిణీ స్త్రీలు, దత్తత, బాల కార్మికులు, అనాధ పిల్లల సంరక్షణ, పై సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల వారీగా లబ్ధిదారుల వివరాలు, తీవ్రమైన పోషకాహార లోపం, మోస్తరు పోషకాహార లోపం ఉన్న చిన్నారుల వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ పిల్లల పోషకాహార స్థితిని సక్రమంగా అంచనా వేసే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని, పిల్లల బరువులను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.మండలాల వారీగా గుర్తించిన ఎస్ ఏ ఎం , ఎం ఏ ఎం పిల్లలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి వైద్యాధికారుల ద్వారా చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సూపర్‌వైజర్ తమ పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీల పూర్తి సమాచారాన్ని కలిగి ఉండి, వారికి అవసరమైన సేవలు అందేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.జిల్లాలో బాల్య వివాహాల నివారణలో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు , మండల బాలల పరిరక్షణ కమిటీలు చురుకుగా పనిచేసేలా ఫీల్డ్ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో శాఖల వారీగా ఏర్పాటు చేసిన అన్ని కమిటీల సమావేశాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు అసంపూర్తిగా ఉన్న సఖి కేంద్రాలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్,సీడీపీఓలు శైలజ, వెంకటరమణ, స్వరాజ్యం, నాజీ, అనంతలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, ఐసీపీఎస్ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో లేజర్ లైట్లు నిషేధం..

- విమానాల భద్రతకు ముప్పు కలిగించేలా లేజర్ లైట్లు వెలిగిస్తే చర్యలు తప్పవు
- కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో లేజర్ బీమ్, స్కైబీమ్, స్టెర్చ్ మూవింగ్ బీమ్ లైట్ల వినియోగంపై ఫంక్షన్ హాల్స్, కన్వెన్షన్ హాల్స్, ఫామ్ హౌస్ నిర్వాహకులకు పోలీసులు అవగాహన కలిగించేందుకు గురువారం సమావేశం నిర్వహించారు.కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ ఆకాశం వైపు ప్రసరించే అధిక తీవ్రత కాంతులు విమానాన్ని టేకప్, ల్యాండింగ్ లు చేసే పైలెట్ దృష్టిని మళ్లించి అంతరాయాన్ని కలిగిస్తాయిన్నారు. ఈవెంట్ నిర్వాహకులు డెకరేటర్లు, డీజేలు, లేజర్ లైటింగ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శంషాబాద్ డిసిపి రాజేష్, ప్రదీప్ రెడ్డి డిప్యూటీ కమిషనర్, శ్రీకాంత్ గౌడ్, జిఎంఆర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, భద్రత అధికారులు పాల్గొన్నారు.



# భద్రకాళి బండ్‌పై పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ టి.వెంకన్న
- భద్రకాళి, వడ్డేపల్లి బండ్ లపై కొన సాగుతున్న పనుల పరిశీలన

**వరంగల్, కార్పొరేషన్ మహా;** భద్రకాళి బండ్ పై పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధి లోని భద్రకాళి, వడ్డేపల్లి బండ్ లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పూర్తి చేసిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భం గా భద్రకాళి బండ్ పై పూర్తి చేసిన పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు పక్షం రోజులో బండ్ పై మిగిలిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని అన్నారు. అనంతరం వడ్డేపల్లి బండ్ ను సందర్శించిన కమిషనర్ బండ్ పై కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని ఆగస్టు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి బండ్ పై హార్టికల్చర్ కు సంబంధించి గ్రీనరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అందుకోసం అంచనాలు తయారు చేయాలని అన్నారు. వడ్డేపల్లి బండ్ పైన గ్రీనరీ ఏర్పాటు కు టెండర్ ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులను ప్రారంభించాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట పర్యవేక్షక ఇంజనీర్ రాజ్ కుమార్, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, డి ఈ రాజ్ కుమార్, ఏ ఈ హరికుమార్ తదితరులు ఉన్నారు.

# పూరి గుడిసెలు లేని తెలంగాణయే లక్ష్యం

- అన్నపురెడ్డిపల్లిలో రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన
- సీతారామ నిర్వాసితుల సమస్యలు వారంలోగా తేల్చాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణలో పూరిగుడిసెలు లేని పేదరికరహిత సమాజాన్ని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన సంకల్పమని తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌లతో కలిసి రూ.2.77 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసానికి మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారంలోగా సీతారామ నిర్వాసితుల సమస్యల పరిష్కారంప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి సీతారామ ప్రాజెక్టు బాధితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి వారం రోజుల్లోగా పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, హౌసింగ్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, తాసిల్దార్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ముంపు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

**బెల్లంపల్లి, మహా:** భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణంలోని ముంపు ప్రాంతాలను గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, డీసీపీ భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్‌బాబు, కమిషనర్ తన్నీరు రమేశులు పరిశీలించారు.రాంనగర్ బ్రిడ్జిపై వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ బ్రిడ్జిని దాటవద్దని అధికారులు హెచ్చరించారు. బ్రిడ్జి ఇరువైపులా బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- రూ.76.46 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం.
- జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు




**కుషాయిగూడ, మహా:** నాణ్యతతో, పారదర్శకంగా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకుతెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు & వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో రూ.76.46 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, కీసర డివిజన్ ఆర్డీఓ, ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావు, డిప్యూటీ కమిషనర్ (ఉప్పల్) ఆనంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, డి ఈ బాలకృష్ణ ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.రామంతాపూర్ భజరంగ్ వ్యాయామశాల (రూ.90 లక్షలు): యువతకు ఆధునిక క్రీడా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో భజరంగ్ వ్యాయామశాల భవనం గ్రౌండ్ ఫ్లోర్ విస్తరణ, బోర్‌వెల్ ఏర్పాటు, ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనుల ద్వారా క్రీడాకారులకు మెరుగైన శిక్షణ వాతావరణం కల్పించనున్నారు. రామంతాపూర్ భాగాయత్ ఉప్పల్ (రూ.56.355 కోట్లు):ఈ ప్యాకేజీ కింద ప్రధాన స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, మల్టీ స్పోర్ట్స్ అరేనా నిర్మాణం, పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం మరమ్మతులు, వి.టి. కమాన్ వద్ద బస్ స్టాప్ అభివృద్ధితో పాటు అనుబంధ మౌలిక వసతుల కల్పన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు వర్షపు నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, క్రీడా సౌకర్యాలను అందించనున్నాయి.బోడ్రాయి - చిలకనగర్ బీరప్పగడ్డ (రూ.3.23 కోట్లు):ఈ ప్రాంతాల్లో దెబ్బతిన్న సీసీ రోడ్ల మరమ్మతులు, స్టార్మ్ వాటర్ డ్రైన్ల పునర్నిర్మాణం, రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, బీరప్పగడ్డ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.చెర్లపల్లి (రూ.15.97 కోట్లు): చెర్లపల్లి, వాంపుగూడ, కాప్రా ప్రాంతాల్లో కల్వర్టుల పునర్నిర్మాణం, బలోపేతం, విస్తరణ, టెర్షియరీ స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం, పునర్నిర్మాణం, ఆర్‌సీసీ పైప్‌లైన్ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన పట్టణ మౌలిక వసతులు, ఆధునిక పౌర సేవలు, సమర్థవంతమైన వర్షపు నీటి పారుదల వ్యవస్థను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం రహదారి సౌకర్యాలు, డ్రైనేజీ వ్యవస్థ, క్రీడా మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటాయని తెలిపారు.అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో, పూర్తి పారదర్శకతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. మొత్తం రూ.76.46 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈ కార్యక్రమంలో శంకుస్థాపనలు నిర్వహించగా, ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల్ల పరమేశ్వర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మొయినాబాద్, మహా:** చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్లను ధ్వంసం చేసి పరికరాలను దొంగిలించిన ఘటనపై మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు గురువారం పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన పోలీసులను కోరారు.

పాఠశాల ఆస్తుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. కాగా, కంప్యూటర్ పరికరాలను ధ్వంసం చేసి దొంగిలించిన వ్యక్తిని చిలుకూరు గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించి కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.






## పెండింగ్ బిల్లులపై కాంట్రాక్టర్ల ఆందోళన

ఎంఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా

**కుషాయిగూడ, మహా:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో అభివృద్ధి పనులు పూర్తి చేసినప్పటికీ పెండింగ్ బిల్లులు విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ కాంట్రాక్టర్లు గురువారం ఎంఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రత్యేకంగా డబ్ల్యూఎంఎస్ వర్క్ మాడ్యూల్ సిస్టమ్ ద్వారా బిల్లుల ఆమోద ప్రక్రియలో, ఉప్పల్ జోనల్ కమిషనర్ స్థాయిలో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్లు సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆరోపించారు. పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినా సమస్యకు పరిష్కారం లభించలేదని తెలిపారు. దీంతో ఎంఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించిన అనంతరం ఆందోళన చేపట్టారు.పెండింగ్ బిల్లుల చెల్లింపులపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరించారు. అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు న్యాయం చేసి, బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు సంగిశెట్టి రవీంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి శివరాత్రి మల్లేష్, అసోసియేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# వర్షాలతో బురదమయం..

- మణుగూరులో ప్రజల అవస్థలు..
- 3 రోజులుగా ఎడతెరిపి లేని వర్షా లు..
- పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు..
- సంబంధిత అధికారులు స్పందించాలని
- సిపిఐ నేత సుధాకర్ డిమాండ్



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మణుగూరు పట్టణం బురదమయంగా మారింది. ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై ఏర్పడిన గుంతలు వర్షపు నీటితో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, పాదచారులు అడుగు బయట పెట్టాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. టీడీపీ సెంటర్, పెట్రోల్ బంక్, సురక్ష బస్టాండ్ ప్రాంతాల్లో ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. సుందరయ్య నగర్, రిక్షా కాలనీ, ఆదర్శ నగర్, సమితి సింగారం తదితర ప్రాంతాల్లో బురద పేరుకుపోవడంతో ప్రజల రాకపోకలు కష్టంగా మారాయి. టీడీపీ సెంటర్ నుంచి చిన్నరాయిగూడెం వెళ్లే రహదారిపై ఇసుక లారీల రాకపోకలతో ఏర్పడిన గోతులు వరద నీటితో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా దోమల వ్యాప్తి పెరిగి సీజనల్ వ్యాధుల భయం కూడా ప్రజలను వెంటాడుతోంది. నిల్వ నీటి తొలగింపు, పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి..**
**: సీపీఐ నేత దుగ్యాల సుధాకర్..**

ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం లక్షల రూపాయలు వెచ్చించి డ్రైనేజీలు, సైడ్ కాలువలు, కల్వర్టులు, వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య ధోరణికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ విమర్శించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ -చర్చి బజార్ ప్రాంతంలో ప్రతి ఏడాది వరదల సమయంలో కాలువ పొంగి వంతెనపై నుంచి నీరు ఇళ్లలోకి చేరుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజల విజ్ఞప్తి మేరకు వంతెన ఎత్తు పెంచేందుకు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టించినట్లు తెలిపారు. అయితే వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ ఇరువైపులా సరైన విధంగా మట్టి వేయకపోవడం, చెరువు మట్టి, కాలువలో తీసిన మట్టిని యథేచ్ఛగా పోయడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిలిచిపోయిందని ఆరోపించారు. దీంతో ఆ ప్రాంతం మొత్తం బురదమయంగా మారి, కాలినడకన వెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. కనీసం నిలిచిన నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు కూడా చేయకుండా కాంట్రాక్టర్ పనులు వదిలేసి వెళ్లిపోయాడని మండిపడ్డారు. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) వెంటనే జోక్యం చేసుకుని నిల్వ నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని, పాదచారులకు ఇబ్బందులు లేకుండా కాలిబాటను అందుబాటులోకి తీసుకురావాలని దుగ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కన్నెబోయిన ప్రసాద్, ఆదరణ రాములు, నారాయణ, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రజాక్ జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రజాక్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ న్యాయాధిపతి మెందు రాజమల్లు, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది ప్రముఖ అంబేద్కర్ వాది ఎంఏ రజాక్ అకాల మృతికి గురువారం న్యాయవాదుల సంఘం, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం ప్రగాఢ సంతాపం సానుభూతిని తెలిపింది. ఈ హృదయపూర్వక ఆత్మీయ నివాళి కార్యక్రమంలో మాజీ సెషన్ జ్యూడిషియరీ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెందు రాజమల్లు,ఐ ఎల్ పి ఓ సెక్రటరీ జనప గోపికృష్ణ, సభ్యులు కాసాని రమేష్,భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, సంఘ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి, సింగరేణి మాజీ పర్సనల్ ఆఫీసర్ సాయి కృష్ణ, సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సబ్బారపు మధుసూదన్ చిన్ని, సీనియర్ ఐఎన్టీయూసీ నాయకులు సోమరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పి.సురేందర్, సంఘ మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ ఖాన్ తోతా, అపరబాలు అల్లి శంకర్, సినీ నటులు తాండూర్ ధనరాజ్, సోషల్ ఆర్గనైజర్ అన్వర్ భాయ్, స్థానిక అంబేద్కర్ వాది బిక్కులాల్, స్వర్గీయ అబ్దుల్ రజాక్ సన్నిహిత స్నేహితులు పాషా భాయ్, ఆస్థాన అడ్వకేట్ శ్రీనివాస్, ఆస్థాన టైపిస్టు రమేష్, రాజేశ్వరరావు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హద్దులు దాటొద్దు



అనుమతి లేకుండా కారవాన్‌లోకి వచ్చాడు.. షాకింగ్ ఘటనను వెల్లడించిన కాజల్ అగర్వాల్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన సినీ జీవితంలో ఎదురైన ఓ అసౌకర్యకరమైన ఘటనను తాజాగా బయటపెట్టారు. ఓ సినిమా షూటింగ్ సందర్భంగా జరిగిన ఈ సంఘటన గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన కాజల్, షూటింగ్ ముగిసిన తర్వాత తాను కారవాన్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఎలాంటి అనుమతి లేకుండానే లోపలికి వచ్చాడని తెలిపారు. అతను తన ఛాతిపై కాజల్ పేరుతో వేయించుకున్న టాటూను చూపించాడని ఆమె చెప్పారు. ఆ ఘటన తనను తీవ్ర అసౌకర్యానికి గురి చేసిందని, అభిమానాన్ని వ్యక్తపరిచే విధానం ఏదైనా సరే వ్యక్తిగత హద్దులను దాటకూడదని ఆమె స్పష్టం చేశారు."నా పేరుతో టాటూ వేయించుకోవడం అతని అభిమానానికి నిదర్శనం కావచ్చు. కానీ అనుమతి లేకుండా కారవాన్‌లోకి రావడం మాత్రం ఏమాత్రం సమంజసం కాదు. ప్రతి ఒక్కరూ సెలబ్రిటీల వ్యక్తిగత గోప్యతను గౌరవించాలి. అభిమానమనే పేరుతో వ్యక్తిగత ప్రదేశాల్లోకి చొరబడడం, ఎదుటివారిని అసౌకర్యానికి గురి చేయడం సరైన ప్రవర్తన కాదు" అని కాజల్ అన్నారు.సెలబ్రిటీలకూ వ్యక్తిగత జీవితం, ప్రైవసీ ఉంటుందని, దానిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆమె సూచించారు. కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ పరిశ్రమలోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశంగా మారాయి. దీంతో సెలబ్రిటీల భద్రత, వ్యక్తిగత గోప్యత, అభిమానుల ప్రవర్తనపై మరోసారి చర్చ మొదలైంది.



## ఒక్కో ఫొటోలో గ్లామర్ మ్యాజిక్..

# దిశా పటానీ కొత్త లుక్ వైరల్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దిశా పటానీ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గ్లామర్, ఫిట్‌నెస్, ఫ్యాషన్ సెన్స్‌కు పెట్టింది పేరైన ఈ భామ తాజాగా షేర్ చేసిన ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మెటాలిక్ అవుట్‌ఫిట్‌లో ఆమె కనిపించిన తీరు అభిమానులను ఫిదా చేస్తోంది.'ఎమ్.ఎస్. ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ' సినిమాతో బాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగుపెట్టిన దిశా తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందిపుచ్చుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. యాక్షన్, డ్యాన్స్, గ్లామర్‌తో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పరుచుకున్న ఆమె 'కల్కి 2898 ఏడీ'లో రాక్సీ పాత్రతో పాటు 'కంగువ' చిత్రంలోనూ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.తాజాగా దిశా తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్న బిహైండ్ ది సీన్స్ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. మెరిసే మెటాలిక్ మినీ డ్రెస్‌లో ఆమె ఎంతో స్టైలిష్‌గా కనిపించింది. ఆధునిక డిజైన్‌తో రూపొందిన ఈ అవుట్‌ఫిట్‌కు సింపుల్ మేకప్, వేవీ హెయిర్‌స్టైల్‌ను జత చేయడంతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రతి ఫొటోలోనూ కాన్ఫిడెన్స్‌తో ఇచ్చిన పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు త్వరలో విడుదల కానున్న మల్టీస్టారర్ చిత్రం 'వెల్కమ్ టు ది జంగిల్'లోని 'క్యూన్' మ్యూజిక్ వీడియో షూటింగ్ సందర్భంగా తీసినవిగా తెలుస్తోంది. పాతకాలపు టెలివిజన్ సెట్లు, స్టైలిష్ బ్యాక్‌డ్రాప్, లెదర్ చైర్‌తో రూపొందించిన సెట్లో దిశా ఇచ్చిన పోజులు ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే లక్షలాది లైక్‌లు, వేలాది కామెంట్లు వచ్చాయి. "గార్జియస్", "స్టన్నింగ్", "క్వీన్ ఆఫ్ గ్లామర్", "ప్రతి ఫ్రేమ్ ఓ మాస్టర్‌పీస్" అంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే దిశా పటానీ ప్రస్తుతం పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉంది. యాక్షన్, కమర్షియల్, గ్లామర్ పాత్రల్లో సమానంగా రాణిస్తూ తన మార్కెట్‌ను మరింత విస్తరించుకుంటోంది. మరోవైపు ఫిట్‌నెస్, ఫ్యాషన్, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ యువతలో తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటోంది. అందం, స్టైల్, ఫిట్‌నెస్, గ్లామర్... ఇలా ప్రతి అంశంలోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్న దిశా పటానీ, ప్రతి కొత్త ఫొటోషూట్‌తో అభిమానులను అలరిస్తూ సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేస్తోంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ లుక్స్ మరోసారి ఆమె ఫ్యాషన్ ఐకాన్ అనే గుర్తింపును మరింత బలపరిచాయి.

## సోషల్ మీడియాలో మళ్లీ ట్రెండింగ్‌లోకి

# వేద్విక సోని

- **ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త ఫొటోకు అభిమానుల నుంచి భారీ స్పందన**
- **గ్లామర్‌తో పాటు సహజమైన అందానికి ప్రశంసలు**
- **తెలుగు, కన్నడ చిత్రాలతో బిజీగా మారుతున్న యువ నటి**

సినీ నటి, మోడల్ వేద్విక సోని మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచింది. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తాజాగా షేర్ చేసిన ఓ అందమైన ఇండోర్ పోర్ట్రెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. స్టైలిష్ లుక్‌తో కనిపించిన ఈ ఫొటోకు "ఐ విల్ బీ వాచింగ్ యూ" అనే ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేయడంతో అభిమానుల్లో మరింత చర్చకు దారి తీసింది.ఈ ఫొటోలో వేద్విక సోని బ్రౌన్ రంగు స్లీవ్‌లెస్ క్రాప్ టాప్‌కు తెలుపు రంగు స్కర్ట్‌ను జత చేసి ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. బంగారు, తెలుపు రంగు బ్రేస్‌లెట్లు, సింపుల్ పెండెంట్ నెక్లెస్‌తో తన లుక్‌ను మరింత ఎలిగెంట్‌గా తీర్చిదిద్దింది. మేకప్‌ను కూడా చాలా సహజంగా ఉంచడంతో ఆమె అందం మరింత మెరిసిపోయిందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.ఫొటో పోస్ట్ చేసిన కొద్ది సమయంలోనే వేలాది లైక్‌లు, కామెంట్లు వచ్చాయి. "గార్జియస్", "స్టన్నింగ్", "నేచురల్ బ్యూటీ", "ఎలిగెంట్ లుక్" అంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపించారు. ప్రతి ఫొటోలో కొత్తదనాన్ని చూపిస్తూ ఫ్యాషన్ ప్రేమికులను ఆకట్టుకోవడం వేద్విక ప్రత్యేకతగా నిలుస్తోంది. సోషల్ మీడియాలో వేద్వికకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 8.10 లక్షలకు పైగా మంది ఫాలో అవుతున్నారు. ఫ్యాషన్ ఫొటోలు, ట్రెడిషనల్ డ్రెస్సులు, లైఫ్‌స్టైల్ అప్‌డేట్లు, ట్రావెల్ మూమెంట్స్, లగ్జరీ స్టైల్ ఫొటోలను తరచూ అభిమానులతో పంచుకుంటూ డిజిటల్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. సోషల్ మీడియాతో పాటు సినీ రంగంలోనూ వేద్విక తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పెరిగిన ఆమె, మానవ వనరుల నిర్వహణ (హ్యూమన్ రిసోర్సెస్)లో ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత మోడలింగ్, నటనపై ఆసక్తితో వినోద రంగంలో అడుగుపెట్టింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, తక్కువ కాలంలోనే సినీ అవకాశాలను అందిపుచ్చుకుంది. రవితేజ నటించిన విజయవంతమైన చిత్రం 'ధమాకా'లో అతిథి పాత్ర ద్వారా దక్షిణాది సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన వేద్విక, అనంతరం 'స్పార్క్', 'మధుర' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తన పాత్రలకు తగ్గట్టుగా నటిస్తూ యువ నటిగా గుర్తింపు తెచ్చుకుంటోంది. 2026లో విడుదల కానున్న 'హరుడు' చిత్రంలో ఆమెకు కీలకమైన పాత్ర లభించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో సుమారు 35 నుంచి 40 నిమిషాల పాటు కనిపించే పాత్రలో ఆమె నటిస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో 'రాజకీయ' అనే రాజకీయ నేపథ్య కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రంతో కన్నడ సినీ పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అందం, అభినయం, ఫ్యాషన్ సెన్స్, సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్... ఇలా అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్న వేద్విక సోని ప్రస్తుతం యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. సోషల్ మీడియాలో ప్రతి కొత్త పోస్టుతో అభిమానులను అలరిస్తూనే, సినీ కెరీర్‌లోనూ ఒక్కో మెట్టు ఎక్కుతూ తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది.



# విలన్‌గా నటించాలని ఉంది



హీరో సుమంత్ ప్రధాన పాత్రలో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ "న్యూటన్స్ థర్డ్ లా" జులై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సుమంత్ తన సినీ కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హీరో పాత్రలతో పాటు సపోర్టింగ్ రోల్స్, ప్రతినాయక పాత్రల్లోనూ నటించాలని తనకు చాలా కాలంగా కోరిక ఉందని వెల్లడించారు.సుమంత్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే ఒక బలమైన విలన్ పాత్ర చేయాలని అనుకుంటున్నానని, అయితే ఇప్పటివరకు అలాంటి అవకాశం రాలేదని చెప్పారు. ఈ కోరికను చాలాసార్లు దర్శకులు, నిర్మాతల వద్ద ప్రస్తావించినా ఎవరూ తనను ఆ కోణంలో చూడలేదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. చాలామంది ఇప్పటికీ తనను 'గోదావరి' సినిమాలోని శ్రీరామచంద్ర పాత్రతోనే గుర్తిస్తున్నారని, అయితే అలాంటి పాత్రలకే పరిమితం కావాలని తాను అనుకోవడం లేదని సుమంత్ స్పష్టం చేశారు. నటుడిగా అన్ని రకాల పాత్రల్లో తన ప్రతిభను చూపించాలని ఉందని, ప్రేక్షకులు తనలోని మరో కోణాన్ని కూడా చూడాలని కోరుకుంటున్నానని చెప్పారు. 'సీతారామం' సినిమా తర్వాత కొన్ని సపోర్టింగ్ పాత్రలు వచ్చినప్పటికీ, నిజంగా సవాల్ విసిరే పాత్రలు మాత్రం రాలేదని ఆయన తెలిపారు. ఆశ్చర్యకరంగా ఇప్పటికీ తనకు ఎక్కువగా హీరో పాత్రల ఆఫర్లే వస్తున్నాయని చెప్పారు. కథకు బలం చేకూర్చే కీలక సహాయ పాత్రలు, బలమైన విలన్ పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తానని స్పష్టం చేశారు. తనకు హీరో పాత్రలతో పాటు ప్రతినాయకుడి పాత్రల్లో కూడా నటించాలనే ఆసక్తి ఉందని సుమంత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక జులై 31న విడుదల కానున్న "న్యూటన్స్ థర్డ్ లా" సినిమాలో ఆయన నటన ఎలా ఉంటుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.



# 83 ఏళ్లలోనూ అదే జోష్..

**కేబీసీతో మరోసారి అలరించనున్న అమితాబ్**

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మరోసారి తన అపారమైన ఎనర్జీతో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. 83 ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహం, అదే అంకితభావంతో సినిమాలు, టెలివిజన్ షోలు చేస్తూ యువతకు సైతం స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నటుడిగా, హోస్ట్‌గా దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన ఇప్పటికీ భారతీయ టెలివిజన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యాఖ్యాతగా కొనసాగుతున్నారు.

హిందీ సినిమా షెహన్‌షాగా గుర్తింపు పొందిన అమితాబ్ బచ్చన్ ఒకవైపు విభిన్నమైన పాత్రలతో వెండితెరపై మెప్పిస్తుండగా, మరోవైపు 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కేబీసీ) షోకు హోస్ట్‌గా తనదైన శైలిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఆయన మాటతీరు, హాస్య చతురత, పోటీదారులతో వ్యవహరించే విధానం కేబీసీ విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. జీవితంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు, శస్త్రచికిత్సలు ఎదురైనా అమితాబ్ ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, సరైన ఆహార నియమాలు, నిత్య వ్యాయామం కారణంగానే ఈ వయసులోనూ ఆయన చురుకుగా ఉంటున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం దేశంలోని పలు భాషల్లో స్టార్ హీరోలు రియాలిటీ షోలకు వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్నారు. తెలుగు బిగ్‌బాస్‌కు నాగార్జున, హిందీ బిగ్‌బాస్‌కు సల్మాన్ ఖాన్, మలయాళంలో మోహన్‌లాల్, కన్నడలో కిచ్చా సుదీప్ హోస్ట్‌లుగా కొనసాగుతున్నప్పటికీ, వయసులో అందరికంటే పెద్దవారైన అమితాబ్ బచ్చన్ అదే ఉత్సాహంతో షోను నడిపించడం విశేషంగా చెప్పుకుంటున్నారు. ఇక కేబీసీ కొత్త సీజన్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభం కానున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి 18' కోసం అమితాబ్ ఇప్పటికే షూటింగ్‌కు సిద్ధమయ్యారు. ప్రీప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే అసలు షూటింగ్ ప్రారంభం కానుందని ఆయన తన బ్లాగ్ ద్వారా వెల్లడించారు. గురుపౌర్ణమి సందర్భంగా అభిమానులు తెలిపిన శుభాకాంక్షలకు కృతజ్ఞతలు తెలుపుతూ సెట్స్‌లోని కొన్ని బిహైండ్ ది సీన్స్ ఫొటోలను కూడా పంచుకున్నారు. "ఫైనల్ మాక్ షూట్స్ పూర్తయ్యాయి... ఇప్పుడు ప్రేక్షకుల ముందే అసలు పరీక్ష మొదలవుతుంది" అంటూ అమితాబ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే ఈసారి కేబీసీ మరింత ఆసక్తికరంగా ఉండబోతుందని, "ఈసారి కొంచెం ఎక్కువగానే ఆలోచించాల్సి ఉంటుంది" అంటూ అభిమానుల్లో ఉత్కంఠను పెంచారు. ప్రపంచ ప్రఖ్యాత గేమ్ షో 'హూ వాంట్స్ టు బి ఎ మిలియనీర్?' ఆధారంగా రూపొందిన కేబీసీ కార్యక్రమానికి మూడో సీజన్‌లో మాత్రమే షారుఖ్ ఖాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, మిగతా అన్ని సీజన్లను అమితాబ్ బచ్చనే విజయవంతంగా నడిపించారు. దీంతో కేబీసీ అంటే అమితాబ్, అమితాబ్ అంటే కేబీసీ అనే స్థాయిలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. ఆగస్టు 10 నుంచి సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో కేబీసీ18 ప్రసారం కానుంది. ఈ సీజన్‌పైనా ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని తన జీవితంతో నిరూపిస్తున్న అమితాబ్ బచ్చన్... నేటికీ అదే గంభీరమైన స్వరం, అదే ఆత్మవిశ్వాసం, అదే చిరునవ్వుతో కోట్లాది మంది అభిమానులను అలరిస్తూనే ఉన్నారు. నటుడిగా, వ్యాఖ్యాతగా, వ్యక్తిత్వంతోనూ తరతరాలకు ఆదర్శంగా నిలుస్తున్న ఆయన నిజంగానే భారతీయ సినీ పరిశ్రమకు చిరస్థాయి లెజెండ్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com